జవహర్ నవోదయ ప్రవేశాలకు
దరఖాస్తు గడువు పొడిగింపు

ఎమ్మిగనూరు రూరల్, నవంబరు19 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బనవాసి జవహర్ నవోదయ విద్యాలయంలో 9వ, 11వతరగతి ప్రవేశ దరఖాస్తు గడువు ఈ నెల 26వతేదీ వరకు పొడిగించినట్లు జవహర్ నవోదయ విద్యాలయం ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ చందిరన్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి 9, 11వ తరగతి విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.


వరి ధాన్యాన్ని ఆరబెట్టిన రైతులు

వరి రైతుకు ఫలితం దక్కడం లేదు. ధరలు ఘోరంగా పడిపోయాయి. సాగు ఖర్చులు విపరీతంగా పెరిగిపోయిన తరుణంలో గిట్టుబాటు ధరలు లేక రైతులు దగా పడుతున్నారు. తక్కువ ధరకు అమ్ముకొని నష్టాలపాలవుతున్నామని ఆవేదన చెందుతున్నారు.

- ఆందోళనలో రైతులు ..
- గిట్టుబాటు కాని వ్యవసాయం
- జిల్లాలో 1,63,284 ఎకరాల్లో వరి పంట సాగు
- బస్తాకు రూ.450 రేటు తగ్గడంతో భారీ నష్టం

జిల్లాలో వరి రైతుకు 279.21 కోట్ల నష్టం

వరి రైతు దగా

బనగానపల్లె, రుద్రవరం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలో 66 వేల హెక్టార్లకు పైగా వరిపంటను ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో రైతులు వరి పంటను సాగు చేశారు. బనగానపల్లె నియోజకవర్గంలో సుమారు 28.930 హెక్టార్లలో వరిపంట సాగు చేశారు బనగానపల్లె మండలంలో 9వేల హెక్టార్లలో, అవుకు మండలంలో 12వేల హెక్టార్లలో, కోవెలకుంట్ల మండలంలో 3700 హెక్టార్లలో, సంజామల మండలంలో 3430 హెక్టార్లలో , కొలిమిగుండ్ల మండలంలో 800 హెక్టార్లలో వరి పంటను సాగు చేశారు.

గిట్టుబాటు ధర ఏది?

రైతులు వరి ధాన్యానికి గిట్టుబాటు ధర లేదని బెంబేలెత్తిపోతున్నారు. ఒక్కో ఎకరాకు సుమారు కౌలు, ఎరువులు, పురుగుమందులు, కలుపు కూలీలు, వరినాటు కూలీలు. సేద్యపు ఖర్చులు కలుపుకుని రూ.50వేలు పెట్టుబడి పెట్టారు. దిగుబడి చూస్తే 38బస్తాలే వచ్చాయి. కానీ రేటు 77 కేజీల బస్తా రూ.1550 పలికింది. గిట్టుబాటు ధర లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాగైతే వ్యవసాయానికి స్వస్తి పలకాల్సిందే అని వాపోయారు.


చిత్రరేణిపల్లెలో తూకం వేస్తున్న వరిధాన్యం బస్తాలు

గత ఏడాది 77 కేజీల వరి ధాన్యం బస్తా రూ.2వేలు

గత ఏడాది వరి ధాన్యం 77 కేజీల బస్తా రూ.2వేలకు అమ్మినట్లు రైతులు తెలిపారు. కానీ ఈసారి రూ.1550 వరి ధాన్యం బస్తా రేటు పలికింది. ఒక్కో బస్తాపై రూ.450 నష్టపోవాల్సి వచ్చింది. రైతు కష్టం నేలపాలైందే తప్ప ఈసారి గిట్టుబాటు ధర కల్పించడంలో నష్టపోవాల్సివచ్చిందని రైతులు వాపోయారు.

జిల్లాలో వరి రైతుకు రూ.279.21 కోట్లు నష్టం

జిల్లాలో ఎకరాకు 38బస్తాలు దిగుబడి వస్తుంది. కానీ ఒక బస్తాకు రూ.450 రేటు తగ్గింది. గత ఏడాది ఒక బస్తా వరి ధాన్యం రూ.2వేలు రేటు పలికింది. ఈ సారి బస్తా ధాన్యం రూ.1550 రేటు పలుకుతుంది. జిల్లాలో 1,63,285 ఎకరాల్లో 38బస్తాలు సగటున 62,04,792 బస్తాల దిగుబడి అంచనా. ఒక బస్తాకు రూ.450 చొప్పున రూ.62,04,792 బస్తాలకు నష్టం రూ.279.21,56,400 ఈసారి ఖరీఫ్ రైతులకు వరిధాన్యంపై నష్టపోయారు.

పెరిగిన పెట్టుబడి ఖర్చులు:

ఇటీవల వ్యవసాయ కూలీలు, రసాయన ఎరువులు, సేద్యపు ఖర్చులు విపరీతంగా పెరిగిపోయాయి. హెక్టారుకు సుమారు రూ.50వేల వరకు ఖర్చు వస్తోంది. కౌలు రైతులకు మరో రూ.35 వేలు అధికం అవుతోంది. సేద్యపు ఖర్చులు, రసాయనిక ఎరువులు, పురుగుల మందులు ధరలు విపరీతంగా పెరిగాయి. కూలీలు సమయానికి దొరకకపోవడంతో రైతులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు వాటితోపాటు అకాల వర్షాలు రైతులను వెంటాడుతూ వచ్చాయి. పంట అమ్మేంత వరకు రైతులు వడ్లను ఆరబోసి వ్యాపారులకు అమ్మే వరకు, లేదా గోదాములకు తరలించేంత వరకు భయం భయంగా రైతులు కాలం వెళ్లదీస్తున్నారు.

మిగతా 6లో..


వరిపంటను కోస్తున్న యంత్రం

ట్రేడ్ లైసెన్సు బకాయిలు

- వసూళ్లలో నిర్లక్ష్యం..
- పట్టించుకోని అధికారులు



నగర పాలక సంస్థ కార్యాలయం

కర్నూలు న్యూసిటీ, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ పరిధిలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, శానిటేషన్ కార్యదర్శుల నిర్లక్ష్యం వల్ల ట్రేడ్ లైసెన్సుల బకాయిలు పెద్ద ఎత్తున పేరుకుపోయాయి. దీని వల్ల నగర పాలక సంస్థ ఆదాయానికి గండిపడుతోంది. పైగా కొత్తగా ఏర్పాటు చేసుకుంటున్న దుకాణాలకు లైసెన్సులు ఇవ్వకుండా కొందరు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, శానిటేషన్ కార్యదర్శులు అందినకాడికి దోచుకుంటున్నట్లు విశ్వసనీయ సమాచారం. నగరంలో వేల సంఖ్యలో దుకాణాలు ఉంటే లైసెన్సులు తీసుకున్న దుకాణాల సంఖ్య చాలా తక్కువగా ఉంది. గతంలో లైసెన్సు తీసుకున్న వారు ఆ తర్వాత రెన్యువల్ చేసుకోవడం లేదు.

మిగతా 6లో..

భూసేకరణ పూర్తి చేయండి

కలెక్టర్ రాజకుమారి


వీడియో కాన్ఫరెన్స్‌లో రెవెన్యూ అధికారులను ఆదేశిస్తున్న కలెక్టర్

నంద్యాల కల్చరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టులు, పరిశ్రమలకు ప్రతిపాదనల మేరకు భూసేకరణను త్వరితగతిన పూర్తిచేయాలని కలెక్టర్ రాజకుమారి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ చాంబర్‌లో పెండింగ్‌లో ఉన్న భూసేకరణపై జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్‌తో కలిసి రెవెన్యూ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ 340సి ప్యాకేజీ 4కింద నందికొట్కూరు, జూపాడుబంగ్లా, పాములపాడు, ఆత్మకూరు మండలాల మీదుగా వెళ్లే రహదారి భూసేకరణకు సంబంధించి 39 ఎకరాలకు క్లెయిమ్స్ మండల తహసీల్దార్ల నుంచి క్లెయిమ్స్ తెప్పించుకొని నిశితంగా పరిశీలించి ప్రతిపాదనలు పంపాలని ఆర్డీవోలకు సూచించారు. అలాగే 1.98 కిమీ సంబంధించిన అడ్డంకులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని సంబంధిత వ్యక్తులను సంప్రదించి త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. 167కె ఒకటో ప్యాకేజీ కింద నంద్యాల నుండి జమ్మలమడుగు మీదుగా నంద్యాల, గోస్పాడు, దొర్నిపాడు, కోవెలకుంట్ల, ఉయ్యాలవాడ, సంజామల మండలాల మీదుగా వెళ్లే రహదారి క్లెయిమ్స్ అవార్డ్ పాసయ్యాయని త్వరగా క్లెయిమ్స్ తెప్పించుకొని భూమి రాశి పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. గుంటూరు-గుంతకల్ డబుల్ రైల్వే లైనింగ్ పనుల భూసేకరణను వెంటనే పూర్తిచేసి పంపాలని డోన్, నంద్యాల ఆర్డీఓలును కలెక్టర్ ఆదేశించారు.

మల్లన్న హుండీ ఆదాయం రూ.4.14 కోట్లు


మల్లన్న కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

శ్రీశైలం, నవంబరు 19(ఆంధ్రజోతి): శ్రీశైల మహాక్షేత్రంలో భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లకు భక్తులు సమర్పించిన కానుకలను మంగళవారం లెక్కించారు. ఈ హుండీల లెక్కింపు ద్వారా రూ.4,14,15,623 నగదు రాబడిగా లభించింది. ఈ హుండీ ఆదాయాన్ని భక్తులు గత 26 రోజుల్లో సమర్పించారు. నగదుతో పాటు 32.230 తులాల బంగారు, 8.5 కిలోల వెండి లభించాయి. అదేవిధంగా 739 యూఎస్ఏ డాలర్లు, 135 ఆస్ట్రేలియా డాలర్లు, 50 యూఏఈ దిర్హమ్స్, 100 కెనడా డాలర్లు, 205 సింగపూర్ డాలర్లు, 200 ఘనా సీడిస్, 1000 ఉగాండా షిల్లింగ్స్, 1020 మెక్సికో పిసో మొదలైన విదేశీ కరెన్సీ ఈ హుండీ లెక్కింపులో లభించాయి. పటిష్టమైన భద్రతా, సీసీ కెమెరాలు, అధికారుల పర్యవేక్షణలో ఈ హుండీ లెక్కింపును నిర్వహించారు. ఈ హుండీ లెక్కింపులో ఆలయ అన్ని విభాగాల అధిపతులు, సిబ్బంది, శివసేవకులు పాల్గొన్నారు.

శ్రీశైలేశునికి స్వర్ణ రథోత్సవం

శ్రీశైలం, నవంబరు 19(ఆంధ్రజోతి): శ్రీశైలం మహాక్షేత్రంలో మంగళవారం ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకొని భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లకు స్వర్ణరథోత్సవం వైభవంగా నిర్వహించారు. వేకువజామున విశేష పూజలను అర్చకులు నిర్వహించారు. ఉదయం 7.30 గంటలకు స్వర్ణరథానికి ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్ఎస్ చంద్రశేఖర ఆజాద్ స్వర్ణరథానికి కొబ్బరికాయలు, గుమ్మడికాయలు సమర్పించి రథోత్సవాన్ని ప్రారంభించారు. సీఐ ప్రసాద రావు, దేవస్థానం చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ జి. స్వాములు పర్యవేక్షించారు.



స్వామి, అమ్మవార్ల రథోత్సవం, రథం ఎదుట భక్తుల కోలాటాలు

నంద్యాల మీదుగా శబరిమలకు ప్రత్యేక రైలు

నంద్యాల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): నంద్యాల మీదుగా శబరిమలకు ప్రత్యేక రైలును కేంద్ర ప్రభుత్వం నడపనుందని నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అయ్యప్ప దీక్షాపరుల కోసం ప్రభుత్వం ప్రత్యేక రైలును నడపనుందని, అయ్యప్ప భక్తులు అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆమె తెలిపారు. రైలు నెం: 07147/07148నెంబరు గల మచిలీపట్నం-కొల్లం వయా నంద్యాలకు డిసెంబర్ 23, 30 తేదీల్లో నంద్యాలకు రాత్రి 8:45 గంటలకు చేరుకొని కొల్లంకు మరుసటి రోజు రాత్రి 9:30కు చేరుకుంటుందని తెలిపారు. అలాగే కొల్లంలో డిసెంబరు 25, జనవరి 1న తెల్లవారు జామున 2:30గంటలకు బయల్దేరి మరుసటి రోజు తెల్లవారుజామున 2:30 గంటలకు చేరుకుంటుందని తెలిపారు.



- ఎండీయూ వాహనాల బరితెగింపు
- జిల్లాలో పేట్రేగిపోతున్న రేషన్ మాఫియా
- పేదలకు చిల్లర.. అక్రమార్కులకు కోట్ల ఆదాయం
- మిల్లర్ల మాయాజాలం

బియ్యం బ్లాక్ మార్కెట్‌కు..!

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ బియ్యం పక్కదారి పడుతోంది. కర్నూలు జిల్లాలో చౌక దుకాణాలు 1233, ఎండీయూ వాహనాలు 409, తెల్లరేషన్‌కార్డులు 6,76,209 ఉన్నాయి. ప్రతి ఎండీయూ వాహనానికి నెలకు రూ.21వేలు ప్రభుత్వం చెల్లిస్తోంది. ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ బియ్యాన్ని రేషన్ కార్డుదారులకు అందిస్తోంది. పేదలు రేషన్ దుకాణాలకు వెళ్లి బియ్యం, ఇతర నిత్యావసరాలు తెచ్చుకోవడం కష్టమవుతుందంటూ గత వైసీపీ ప్రభుత్వం భారీ ఖర్చుతో ఎండీయూ (మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్) వాహనాలను ఏర్పాటు చేసింది. వీటి ద్వారా రేషన్ బియ్యాన్ని ఇంటింటికి తీసుకువెళ్లి అందిస్తున్నట్లు జగన్ ప్రభుత్వం ఆర్భాటంగా చెప్పుకుంది. అంతా అది నిజమేనని ప్రజలు సంతోషపడ్డారు. కానీ ఆ వాహనాలు ఆ వీధిలో ఏదో ఒక చివర ఆపేసి సైరన్ కొడితే లబ్ధిదారులే సంచులు, రేషన్ కార్డులు చేతపట్టుకుని వాహనాల దగ్గరకి పరుగులు పెట్టాల్సిన పరిస్థితి నెలకొంది. ఆ సమయంలో ఎవరైనా ఇంట్లో లేకుంటే వారికి బియ్యం ఆ నెలకు అందే పరిస్థితి లేదు. వాహనం దగ్గరకు వచ్చిన కొంత మంది లబ్ధిదారులకు ఇచ్చామని అనిపించి మిగిలిన వాటిని నేరుగా నల్లబజారుకు తరలిస్తున్నారు.

ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి నెలా ఒకటో తేదీ నుంచి 20వ తేదీ లోపు తెల్లరేషన్ కార్డుదారులకు ఒక్కొక్కరికి ఐదు కిలోల చొప్పున కుటుంబ సభ్యులు ఎంత మంది ఉంటే అంత బియ్యాన్ని ప్రభుత్వం ఉచితంగా ఇస్తోంది. రేషన్‌కార్డు దారులకు కిలో రూ.10 చొప్పున డబ్బులు ఎర వేస్తున్నారు రేషన్ అక్రమార్కులు. లబ్ధిదారుల దగ్గర బియ్యంను కిలో రూ.10 నుంచి రూ.15 కొని వాటిని పాలిష్ పట్టించి కిలో రూ.25 నుంచి రూ.30లకు వ్యాపారులకు అమ్ముతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎండీయూ వాహనాలు వచ్చాక రేషన్ బియ్యం తరలింపు తేలికపడంతో 60శాతం ఇతర రాష్ట్రాలకు వెళ్లిపోతున్నాయి. కిలో బియ్యం బహిరంగ మార్కెట్‌లో రూ.45 నుంచి రూ.55 వరకు ధర పలుకుతోంది. సాధారణ రకం బియ్యం అయితే రూ.35 నుంచి 40 వరకు ఉంది.


నిల్వగా ఉన్న రేషన్ బియ్యం

రైస్ మిల్లర్ల కీలక పాత్ర

రేషన్ పంపిణీలో ఎండీయూ వాహనాలు కీలకం. గత వైసీపీ ప్రభుత్వం ఎండీయూ వాహనాలు ప్రవేశ పెట్టడానికి ముందు రేషన్ దుకాణాలు ఇళ్ల మధ్య ఉండడం, వాటి దగ్గరకు సరుకులు దింపే లారీలు మినహా మరి ఇతర వాహనం వచ్చినా రేషన్ సరుకులు నల్లబజారుకు తరలిస్తున్నారని ఇట్టే పసిగట్టి చుట్టుపక్కల వారు అధికారులకు సమాచారం అందించే పరిస్థితి ఉండేది. ప్రస్తుతం ఏ అడ్డంకులు లేకుండా అధికారికంగానే రేషన్ బియ్యం ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ అక్రమార్కులు, అక్రమంగా పక్క రాష్ట్రాలకు తరలిస్తున్నారు. బియ్యం, అక్రమ రవాణాలో కొందరు మిల్లర్లే క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారనే ఆరోపణలు వెలువెత్తుతున్నాయి.

మిగతా 7లో..

పెద్దాసుపత్రిలో రెండో ఎగ్జిట్ గేట్


కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.కే. వెంకటేశ్వర్లు



హెచ్‌వోడీల సమావేశంలో మాట్లాడుతున్న సూపరింటెండెంట్

కర్నూలు హాస్పిటల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో త్వరలో రెండో ఎగ్జిట్ గేట్ ఏర్పాటు చేస్తున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. కే. వెంకటేశ్వర్లు వెల్లడించారు. 3 నెలల తర్వాత ధన్వంతరి హాలులో వివిధ విభాగాల హెచ్‌వోడీలతో సూపరింటెండెంట్ తొలి సమావేశం నిర్వహించారు. ఆసుపత్రిలో రోగులు వారి సహాయకుల రద్దీ విపరీతంగా పెరిగిందని, దీని నివారణ కోసం గైనిక్, పీడియాట్రిక్ విభాగాల్లో విజిటర్ పాసులు అందుబాటులోకి తెస్తామన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్లు డా. శ్రీరాములు, డా. సీతారామయ్య, వైస్ ప్రిన్సిపాల్ డా. రేణుకాదేవి, సీఎస్ఆర్ఎంవో డా. వెంకటేశ్వరరావు, డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో డా. హేమనళిని, హెచ్‌వోడీలు పాల్గొన్నారు.

బాల్యానికి.. బలమైన శక్తి...!



- హక్కులతో ఆకాంక్షను నేరవేర్చుకునే మార్గం
- జిల్లాలో 70వేల మందికిపైగా బాలకార్మికులు
- సక్రమంగా అమలుకు నోచుకొని హక్కులు
- నేడు ప్రపంచ బాలల హక్కుల సంరక్షణ దినం..

ఆత్మకూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): బాలకార్మికుల్లో రాష్ట్రంలోనే ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రథమస్థానంలో ఉన్నట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం రోజుకు 6గంటలు పనిచేసే 6నుంచి14ఏళ్ల మధ్య ఉన్న బాల కార్మికులు సుమారు 70వేల మంది వరకు ఉన్నారు. అలాగే మరో 30వేల మందికి పైగా బడిబయట పిల్లలుగా ఉన్నారు. కాగా జిల్లా పరిధిలో ఎమ్మిగనూరు మండలం బాలకార్మికులు ఎక్కువ ఉన్న మండలంగా గుర్తింపు వుంటే ఆ తర్వాతి స్థానాలను నందవరం, హొళగుంద, కోసిగి, గోనెగండ్ల, దేవనకొండ, పెద్దకడబూరు మండలాలు ఉన్నట్లు జిల్లా అధికారిక గణాంకాలు పేర్కొంటున్నాయి. కోసిగి మండలంలో అత్యల్పంగా అక్షరాస్యతశాతం నమోదు కావడం గమనార్హం. ప్రత్యేకించి గిరిజన చిన్నారులకు కనీస విద్య కూడా అందడం లేదు. నేటికి గూడేలకు పరిమితమై అటవీ ఉత్పత్తుల సేకరణే జీవితగమ్యంగా ముందుకెళ్తున్నారు.

మంచి, చెడులను పూర్తిగా అర్థం చేసుకోలేని బాలలకు హక్కులేంటి? అనుకుంటున్నారా..? కానీ సమాజంలో బలహీనులూ, దోపిడీకి గురయ్యే వారిలో పిల్లలు ఉన్నారు. పిల్లలను దోచుకునే పెద్దలున్న చోట చిన్నారులకు హక్కులుండటం తప్పనిసరి. బాల్యానికి బలమైన శక్తిని చేకూర్చలన్న సంకల్పంతో ఐక్యరాజ్యసమితి పిల్లల హక్కుల కోసం ఒక ఒప్పందాన్ని ఆమోదించింది. చైల్డ్‌రైట్స్ కన్వెన్షన్ (సీఆర్‌సీ)గా పేర్కొనే ఈ ఒప్పందం గురించి ప్రపంచంలోని మెజార్టీ దేశాలు ఒకతాటిపైకి వచ్చాయి. ముందుగా బాలల హక్కులపై ఐక్యరాజ్యసమితి 1959లో ప్రకటన చేసింది. 1979వ సంవత్సరాన్ని అంతర్జాతీయ బాలల హక్కుల సంవత్సరంగా ప్రకటించింది. 1989 నవంబరులో బాలల హక్కుల పరిరక్షణపై సమావేశం నిర్వహించి ఆమోదించింది. 1990 సెప్టెంబరులో బాలల అభ్యున్నతి కోసం ఐక్యరాజ్యసమితి ప్రపంచసదస్సు నిర్వహించింది. 1992లో చైల్డ్‌రైట్స్ కన్వెన్షన్‌పై భారత్ కూడా సంతకం చేసింది.



బాలల హక్కులు ఇవీ..

18 సంవత్సరాలలోపు బాలలందరికి భారత రాజ్యాంగం పలు హక్కులను కల్పించింది. సమానత్వం, కులం, మతం, జాతి, భాష, ఆడ, మగ, పుట్టుక ప్రదేశం వంటి ఏ విధమైన వివక్షను చూపకూడదు. బిడ్డ పుట్టగానే పేరు, జాతీయత కలిగి ఉండటం, తల్లిదండ్రులతో కలిసి జీవించడం బాలల హక్కు. బాలలను అక్రమంగా రవాణా చేయడం, వ్యభిచార వృత్తిలో దించడం, జీతాలకు పెట్టడం నేరం. అలాగే బాలలు వారి అభిప్రాయాలను పాటలు, బొమ్మలు, ఆటలు, రచనల ద్వారా వ్యక్తం చేయవచ్చు. తల్లిదండ్రులు ఇద్దరూ పనుల్లోకి వెళ్లినట్లయితే ఆ బాలల బాధ్యత ప్రభుత్వాలు తీసుకోవాలి. పిల్లలను ఎవరైనా హింసించినా, దౌర్జన్యం చేసినా, వేధించినా నేరమే. మానసికంగా, శారీరకంగా వికలాంగులైన వారి వృద్ధికి వారిలో ఆత్మవిశ్వాసం పెంపుదలకు ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలి. ప్రమాదకరమైన పనులు, గనుల్లో, ప్రేలుడు పదార్థాల తయారీలో, హోటళ్లలో బాలల్ని పనిలో ఉంచకూడదు. మాదకద్రవ్యాల నుంచి బాల



లను దూరం చేయాలి. వారికి అందుబాటులో వుంచడం, వారి ద్వారా రవాణా చేయడం నేరమే. బాలల్ని నిర్బంధించరాదు. లైంగిక దూషణ చేయరాదు. బాలల సంక్షేమానికై దోపిడీ ఏ రూపంలో వున్నా.. ప్రభుత్వాలు నిషేధించాలి. అంతర్జాతీయంగా గాని బాలలకు ఇంతకంటే మెరుగైన హక్కులను అందించే చట్టాలు ఉంటే ఆ హక్కులను పొందడానికి బాలలకు హక్కు వుంది. ఇవి బాలల హక్కులపై ఐక్యరాజ్యసమితి ఒడంబడిక సంక్షిప్తరూపం.

పిల్లల్ని బడికి పంపించాలి



బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించి పిల్లల్ని బడికి పంపించేలా తల్లిదండ్రులు చొరవ తీసుకోవాలి. అలాంటప్పుడే బాలల హక్కులను కాపాడవచ్చు. తల్లిదండ్రులు విద్య ప్రాముఖ్యతను గుర్తించి పిల్లల్ని పాఠశాలలకు పంపాలి. ప్రభుత్వం కూడా పాఠశాల విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తోంది. వీటిని సద్వినియోగం చేసుకోవాలి.

- వెంకటేష్, ఉపాధ్యాయుడు, కొట్టాలచెరువు గ్రామం, ఆత్మకూరు మండలం.



(5 పేజీ తరువాయి)

వరి రైతు దగా

ఈ ఏడాది వివిధ రకాల తెగుళ్లు వరి పంటను ఆశ్రయించాయి. ఈ తెగుళ్ల బారినుంచి రక్షించుకోవడానికి భారీగా పురుగులు మందులు వాడారు. ఎండు తెగుళ్లు, అగ్గి తెగుళ్లు, కాటుక తెగుళ్లు సోకాయి. అగ్గి తెగుళ్లు కూడా విజృంభించాయి. ఈ తెగుళ్లు వరి మొక్క ఆకులు, మెడభాగం, కణుపులు, చివరి భాగాలను ఎక్కువగా ఆశించింది. అధిక వర్షాలకు తోడు నేలలో సరిపడా తేమ ఉండకపోవడంతో ఈ తెగులు వ్యాపించిందని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. ఆకుమచ్చ తెగులు పిలక దశ నుంచి పొట్ట దశ వరకు వ్యాపించడంతో రైతులు వివిధ రకాల పురుగుల మందు స్ప్రే చేసి పంటను సంరక్షించుకున్నారు. ఇందుకు భారీగా ఖర్చు చేశారు. అలాగే మచ్చతెగులు, కాటుక తెగుళ్ళు కూడా ఈ ఏడాది భారీగా ఆశించడంతో రైతులు ఆర్థికంగా చితికిపోయారు.



రుద్రవరం మండలం చిత్తరేణిపల్లెలో వరి పొలం

గిట్టుబాటు ధర కల్పించాలి



వరిధాన్యానికి ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలి. ప్రస్తుతం క్వింటాలుకు కేవలం రూ.1750 ఉంది. ఈ ధరను రూ.2 వేలుకు పెంచాలి. ధరలు పడిపోవడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నాం.

-చంద్రశేఖర్‌రెడ్డి, యాగంటిపల్లె రైతు

జాతీయ ఉపాధి పథకాన్ని అనుసంధానం చేయాలి



జాతీయ ఉపాధి పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేసి రైతులను ఆదుకోవాలి. పెట్టుబడి సాయం అందించాలి. రసాయనిక, పురుగు మందుల రేట్లు తగ్గించాలి. వరిధాన్యం మద్దతు ధరలు పెంచి రైతులను ఆదుకోవాలి.

-బంది రవీంద్రనాథరెడ్డి, యాగంటిపల్లె, రైతు

గత ఏడాది బస్తా ధాన్యం రూ.2వేలకు విక్రయించా



గత ఏడాది వరి ధాన్యం బస్తా రూ.2వేలకు విక్రయించా. ఈ ఏడాది 12 ఎకరాల్లో వరి సాగు చేశా. వరి ధాన్యం బస్తా రేటు రూ.1550 పలికింది. గత ఏడాదితో పోల్చుకుంటే ఒక బస్తాకు రూ.450 నష్టపోయాం.

-సుబ్బారావు, రైతు, చిత్తరేణిపల్లె

గిట్టుబాటు ధర లేదు



వరి ధాన్యానికి గిట్టుబాటు ధర లేదు. 77 కేజీల బస్తా రూ.1550 మాత్రమే రేటు పలికింది. ఈసారి కౌలుకు తీసుకుని 17 ఎకరాలు వరి పంట సాగు చేశా. పెట్టుబడి, కౌలు కలిపి ఒక్కో ఎకరాకు 50వేలు ఖర్చు వచ్చింది. దిగుబడి 38 బస్తాలు వచ్చాయి.

-రామలింగం, రైతు, చిత్తరేణిపల్లె

రైతు కష్టానికి ఫలితం లేదు



వరి రైతుకు కష్టం పుడమిపాలైంది. ఈసారి గిట్టుబాటు ధర లేదు. గత ఏడాది వరి ధాన్యం బస్తా రూ.2వేలు రేటు పలికింది. ఈ ఏడాది రూ.1550 మాత్రమే రేటు పలుకుతున్నది. దీంతో రైతు నష్టపోవాల్సి వచ్చింది.

-మాధవ, రైతు, చిత్తరేణిపల్లె

పంట దిగుబడి తగ్గింది



సాధారణంగా 40 నుంచి 48బస్తాలు దిగుబడి రావాల్సి ఉంది. ఈసారి ఎకరాకు 38 బస్తాలే దిగుబడి వచ్చింది. గిట్టుబాటు ధర కూడా లేదు. వరి ధాన్యం ఈసారి రైతును నట్టేట ముంచింది.

-రామక్రిష్ణ, రైతు, చిత్తరేణిపల్లె

ఎంత ప్రమాదం



బండిఆత్మకూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఈ దృశ్యం చూడండి... ద్విచక్ర చిన్నవాహనం వెనుక సీట్లో ఇద్దరిని చెరో వైపు కూర్చోబెట్టుకుని ప్రయాణిస్తున్నాడు. నంద్యాల-ఆత్మకూరు ప్రధాన రహదారిలో బండిఆత్మకూరు వద్ద వెలుగోడు వైపు ఓ వాహనదారుడి ఇలా అత్యంత ప్రమాదకరంగా వెళ్తున్నాడు. ఏమాత్రం బండి అదుపుతప్పినా ప్రమాదం జరగడం తప్పనిసరి.

మహానందీశ్వరునికి కార్తీక నక్షత్ర పూజలు

మహానంది, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో కార్తీక మాస ఆరుద్ర నక్షత్రం పురస్కరించుకొని మంగళవారం భక్తి శ్రద్ధలతో అన్నాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ వేదపండితులు రవిశంకర్ అవధాని ఆధ్వర్యంలో అర్చకులు ప్రత్యేకంగా తయారు చేసిన అనాన్ని మేళతాళాలతో ఆలయ ప్రాంగణంలోని వంటశాల నుండి ప్రధాన ఆలయంలోకి తెచ్చారు. అనంతరం శివునికి పూజలు జరిపారు.

ట్రేడ్ లైసెన్సు బకాయిలు



(5 పేజీ తరువాయి)

నగర పాలక పరిధిలో ట్రేడ్ లైసెన్సు ఫీజు భారీగా పేరుకుపోయాయి. 2021 ఏప్రిల్ నుంచి 2024 సెప్టెంబర్ వరకు మొత్తం బకాయిలు రూ.11,35,23,531 ఉండగా రూ. రూ.8,07,12,580 వసూలు చేశారు. ఇంకా రూ.3,28,10,951 వసూలు చేయాల్సి ఉంది. దీనిపై పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీనిని వసూలు చేయడంలో నగర పాలక ఆరోగ్య విభాగం అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఈ క్రమంలో నగరపాలక సంస్థకు పూర్తిస్థాయిలో గండిపడుతోంది. నగరంలో 50 వేలకు పైగా దుకాణాలు ఉండగా అధికారుల లెక్కల్లో మాత్రం 10,858 దుకాణాలకు లైసెన్సులు ఉన్నట్లు చూపిస్తున్నారు. లైసెన్సుకు నగదు వసూలు చేయని దుకాణాలు సుమారు 25 వేలకు వరకు ఉంటాయి. ఇందులో సిబ్బంది లైసెన్సు పేరుతో వసూలు చేస్తున్న నగర పాలక సంస్థకు జమచేయకుండా స్వాహ చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. దీంతో ప్రతి సంవత్సరం రూ.లక్షలు పక్కదారి పడుతున్నాయి. బకాయిలు చాలా వరకు వసూలు చేసి లెక్కలు చూపడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఈ క్రమంలోనే నగర పాలక ఉన్నతాధికారులు లైసెన్సు వసూళ్లపై దృష్టిసారిస్తే నగర పాలక ఆదాయం పెరుగుతోంది.

దోచుకుంటున్నారు...

నగరంలో సుమారు 7 లక్షల జనాభా ఉంది. చిన్న, పెద్ద దుకాణాలు కలిపి 50 వేలకు పైగా ఉంటాయి. నగర పాలక పరిధిలో 10858 దుకాణాలకు మాత్రమే లైసెన్సులు ఉన్నాయి. నగర పాలక ప్రజారోగ్య విభాగం ప్రతి దుకాణం నుంచి లైసెన్సు, రెన్యువల్ వసూలు చేయాల్సి ఉంది. ఈ ప్రక్రియ ప్రతి సంవత్సరం ఏప్రిల్ 1లోపల పూర్తి చేయాలి. ఏప్రిల్ నెలాఖరుకు చెల్లించని వారు 25 శాతం అపరాధ రుసుముతో కలిపి చెల్లించాలి. మే 1 నాటికి అన్ని దుకాణాల నుంచి పూర్తిస్థాయిలో వసూలు చేయాలని నిబంధనలు ఉన్నాయి. లేదంటే సంబంధిత అధికారి సొంత సొమ్ము జమ చేయాలి. రుసుము చెల్లించిన ప్రతి దుకాణాలోను లైసెన్సు ధృవీకరణ పత్రం ప్రదర్శించాలి. అయితే నగరంలోని పలు కాలనీల్లో పలువురు దుకాణదారులు ట్రేడ్ లైసెన్సు తీసుకోకుండానే వ్యాపారాలు సాగిస్తున్నారు. ఇలాంటి వారికి నగర పాలక అధికారులు పూర్తి సహకారం అందిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి.

వసూలు చేస్తున్నాం

నగరంలో పెండింగ్ లేకుండా ట్రేడ్ లైసెన్స్ వసూలు చేస్తున్నాం. విద్యుత్ శాఖ అధికారులకు నగరంలో ఎన్ని వాణిజ్య కనెక్షన్లు ఉన్నాయో తెలపాలని లేఖ రాశాం. అక్కడ నుంచి వచ్చిన వెంటనే వ్యాపారులు ట్రేడ్ లైసెన్సు తీసుకునేలా ప్రోత్సహిస్తాం. పాత బకాయిలు..కొత్తవి కలిపి సుమారు రూ.3 కోట్ల దాకా ఉంది. త్వరలోనే వసూలు చేసేలా చర్యలు తీసుకుంటాం.

- కే.విశ్వేశ్వరరెడ్డి, ఆరోగ్య అధికారి, నగర పాలక సంస్థ

విశ్వకర్మ.. ఇదేం ఖర్మ

- పథకం మంచిదే.. అమలులోనే లోపాలు
- సమన్వయలోపంతో లబ్ధి చేకూరింది శూన్యం
- శిక్షణలో తిర'కాసు'
- పురోగతిలేక దరఖాస్తుదారులు గగ్గోలు

కర్నూలు, రాజ్‌విహార్ సర్కిల్, నవంబరు 19, (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకం పురిటినొప్పులు పడుతోంది. గతేడాది సెప్టెంబరు 17న ఆర్భాటంగా ప్రారంభించిన ఈ పథకం అమలులో ఆరంభశూరత్వంగా మారిందనే చెప్పాలి. పథకం ఉద్దేశం మంచిదే అయినా కేంద్ర, రాష్ట్రాల మధ్య సమన్వయలోపంతో అమలుకు నోచుకోవడం లేదు. వైసీపీ ప్రభుత్వ హయాంలో కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రారంభించగా అప్పటి పాలకులు ఈ పథకాన్ని నిర్లక్ష్యం చేశారు. ఆ తరువాత సార్వత్రిక ఎన్నికల షెడ్యూలు రావటంతో విశ్వకర్మ పథకం కొద్దికాలంపాటు అటకెక్కింది. కొన్నాళ్ల క్రితం ఈ పథకంలో చిన్నపాటి కదలిక మొదలైనా, నత్తనడకన నడుస్తుండటంతో ఆశించిన స్థాయిలో పురోగతి కానరావటం లేదని దరఖాస్తుదారులు గగ్గోలు పెడుతున్నారు.



జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ కార్యాలయం

సరైన సహకారం లేదు



విశ్వకర్మ యోజన పథకం ఉద్దేశం బాగుంది. కానీ వీటి అమలులో ప్రభుత్వ శాఖలు సరియైన సహకారం అందిచటం లేదు. పథకంపై అవగాహన కల్పించటం లేదు. ఏమైనా సందేహాలు వస్తే నివృత్తి చేయడం లేదు. శిక్షణ సంస్థలు సైతం తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ దోచుకుంటున్నారు. దీనిపై ఉన్నతాధికారులు చొరవ చూపితే పథకం గాడిన పడుతోంది

.- రాంబాబు, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి

అభివృద్ధికి అవాంతరం

కులవృత్తులను ప్రోత్సహిస్తూ, వారిలోని కళానైపుణ్యాన్ని వెలికి తీయటంతోపాటు వారిని సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి చేయాలనే సత్సంకల్పంతో ఈ పథకానికి రూపకల్పన చేశారు. ఇందులో పలు ప్రభుత్వ శాఖలకు బాధ్యతలు అప్పగించారు. జిల్లా పరిశ్రమల కేంద్రం, పురపాలక, పంచాయతీ, గ్రామీణాభివృద్ధి, బ్యాంకర్లు, నైపుణ్యాభివృద్ధి సంస్థ తదితర శాఖలను ఈ ప్రక్రియలో భాగస్వాములను చేశారు. ఇక్కడే అసలు సమస్య మొదలైంది. అన్ని శాఖలను కలెక్టర్ సమన్వయపరుస్తూ అజమాయిషీ చేయాల్సి ఉండగా, తీరిక లేని విధుల్లో భాగంగా కొంత నిర్లిప్తత నెలకొంది. ఫలితంగా బాధ్యతాయుతమైన శాఖలు సైతం కొంత అంటీముట్టనట్లు వ్యవహరిస్తున్నాయి. పథకం ప్రారంభమై ఏడాది దాటినా ఆన్‌లైన్‌లో దరఖాస్తు స్వీకరణ, నమోదు, శిక్షణ స్థాయిలోనే అవసరార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే శిక్షణ పూర్తి చేసి, గుర్తింపు కార్డుల జారీ, పనిముట్ల అందజేత, రుణాల మంజూరు, ఉత్పత్తుల మార్కెటింగ్ ఇంకెప్పుడో జరుగుతుందోనని దరఖాస్తుదారులు వాపోతున్నారు.

సాంకేతిక సమస్యలు.. సమన్వయ లోపం

కర్ణుడి చావుకు సవాలక్ష కారణాలు అన్నట్లు విశ్వకర్మ పథకం అమలులోనూ అన్నే అవాంతరాలు ఎదురవుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా లక్షకు పైగానే ఈ పథకం కోసం దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం. కాని వీటి పరిశీలన చాలా మందకొడిగా సాగుతోంది. పలు శాఖల్లో సిబ్బంది కొరత, సర్వర్లతో సాంకేతిక సమస్యలు, శాఖల మధ్య సమన్వయలోపం, ప్రజల్లో విశ్వకర్మ యోజన పథకంపై అవగాహన రాహిత్యం వెరసి పనులు నెమ్మదిగా నడుస్తున్నాయి. ఒక్క దరఖాస్తు పరిశీలనకే దాదాపు 15 నిమిషాలు సమయం తీసుకోనుంది. జిల్లా పరిశ్రమల కేంద్రంలో జనరల్ మేనేజర్, డీడీ, ఏడీ తదితర కీలక శాఖలు ఖాళీగా ఉండటంతో ఒక్కరిపైనే పని భారం పడుతోంది.


శిక్షణలో తిరకాసు: విశ్వకర్మ యోజన పథకం ద్వారా అర్హులైన వారికి శిక్షణను ఇచ్చేందుకు నగరంలో 12 చోట్ల ప్రైవేటు వ్యక్తులు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆరు రోజుల శిక్షణ కాలంలో శిక్షణార్థులకు రోజుకు రూ.680 చొప్పున మొత్తం సొమ్మును నేరుగా వారీ బ్యాంకు ఖాతాల్లోకి జమ చేస్తారు. శిక్షణ సంస్థలకు ఒక్కో వ్యక్తికి ఇంత చొప్పున ప్రభుత్వమే డబ్బులు చెల్లిస్తోంది. ఇక్కడే తిరకాసు ఉంది. కొంత మంది శిక్షణ కేంద్రాల నిర్వాహకులు లేని కోర్సులను సైతం తమ వద్ద ఉన్నట్లు చూపిస్తూ, శిక్షణార్థులను పేర్లను నమోదు చేసుకుని వేరే ప్రాంతాల్లోని తమ శాఖల ద్వారా శిక్షణ పొందినట్లు చూపిస్తున్నారు. ఇలా బోగస్ శిక్షణతో ప్రభుత్వం నుంచి బిల్లులు పొందేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. మరి కొంత మంది కేంద్రం నిర్వాహకులు, దరఖాస్తుదారులను తమ వద్ద చేర్చుకొని వారికి ఆన్‌లైన్‌లో ఒక గుర్తింపు సంఖ్యను కేటాయించి వారికి శిక్షణ ఇవ్వకుండా జాప్యం చేస్తున్నారు. ఇలా ఒకే కేంద్రం నిర్వాహకుడు దాదాపు 800 మందికి శిక్షణ ఇవ్వకుండా తమ వద్దనే పట్టిపెట్టినట్లు అధికారులకు ఫిర్యాదులు అందాయి. ప్రైవేటు కేంద్రాల నిర్వాకం వల్ల ప్రభుత్వ రంగ సంస్థ అయిన జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థకు అభ్యర్థులు కరువయ్యారు. ప్రైవేటు కేంద్రాలు ఇప్పటికే కొన్ని బ్యాచ్‌లకు శిక్షణ పూర్తి చేయగా, ఇక్కడ మాత్రం ఇంత వరకు ఒక్క మనిషికి కూడా శిక్షణ ఇవ్వకపోవటం గమనార్హం.

అమలులో అడ్డంకులు..

తొలుత ఈ పథకం కింద 18 కులవృత్తుల వారిని అర్హత ఆధారంగా ఎంపిక చేయాలని నిర్ణయించారు. దీంతో అన్ని కులాలతోపాటు టైలరింగ్, బేల్దారు పనికి సంబంధించి విపరీతమైన డిమాండు నెలకొని భారీ స్థాయిలో దరఖాస్తులు వచ్చాయి. కాని ముందస్తు సమాచారం లేకుండానే వీటిని ఈ పథకం నుంచి తొలగించారు. ఫలితంగా పెద్ద మొత్తంలో దరఖాస్తులు నిరాశకు లోనవుతున్నారు. వడ్రంగికి సంబంధించి సైతం దరఖాస్తు స్వీకరణ, పరిశీలనలో కొంత అలసత్వం నెలకొనటంతో ఈ కోర్సుపై కూడా అవసరార్థుల్లో సందేహాలు తలెత్తుతున్నాయి.


ఊపిరి తీసుకోవడమే కష్టం

- పెరుగుతున్న సీవోపీడీ బాధితులు
- తొలి దశల్లో గుర్తిస్తేనే చికిత్స
- నేడు వరల్డ్ సీవోపీడీ డే



కర్నూలు హాస్పిటల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): క్రానిక్ అబ్జెక్టివ్ పల్మొనరీ డిసీజ్ (సీవోపీడీ) అనేది ఊపిరితిత్తుల వ్యాధి. సీవోపీడీ సమస్యల్లో క్రానిక్ బ్రాంకైటీస్, ఎంఫెసెమా రకాలు కనబడుతాయి. ఏటా నవంబరు మూడో బుధవారం వరల్డ్ సీవోపీడీ డేను నిర్వహిస్తున్నారు. ప్రతి ముగ్గురు స్మోకర్స్‌లో ఒకరికి ఈ జబ్బు వస్తుంది. సీవోపీడీపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు డబ్ల్యూహెచ్‌వో ఈ ఏడాది "మీ ఊపిరితిత్తుల పనితీరును తెలుసుకోండి".. అన్న నినాదాన్ని ఇచ్చింది.

ఉమ్మడి జిల్లాలో సీవోపీడీ బాధితుల సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోంది. పదేళ్ల క్రితం జనాభాలో 3 శాతం కంటే ఈ వ్యాధి ఇప్పుడు 8 శాతానికి పెరిగింది. సీవోపీడీ వ్యాధిగ్రస్థుల్లో 65 శాతం పొగతాగే అలవాటు ఉన్న వారే ఉన్నారు. మిగిలిన బాధితులు పరిశ్రమల్లో దుమ్మూ, ధూళి, పొగ, కాలుష్య రసాయనాల మధ్య పనిచేసే వారు ఉన్నారు. ఉమ్మడి జిల్లాలోని డోన్, బేతంచెర్ల, బనగానపల్లె, అవుకు, కర్నూలు పారిశ్రామిక ప్రాంతాల్లో సీవోపీడీ బాధితులు అధికంగా ఉన్నారు. ఇక కర్నూలు జీజీహెచ్‌లోని ఊపిరితిత్తుల వార్డుకు ప్రతిరోజు ఓపీ కేసులు 120 దాకా ఉంటాయి. వీరిలో 50 శాతం సీవోపీడీ బాధితులు వస్తుంటారు. వీరికి ఇన్‌హెలర్స్, యాంటి బయాటిక్స్ మందులు ఇచ్చి చికిత్స అందిస్తున్నారు.



చికిత్స

మందుల కన్నా ముందు కౌన్సి లింగ్ చాలా అవసరం. పొగతాగడం మానేయాలి. బ్రాంకో డైలేటర్స్, ఇన్‌హెలర్స్, స్టెరాయిడ్స్ ఛాతీ వైద్యుల పర్యవేక్షణలో వాడాలి. ఆక్సిజన్ థెరపీ దీర్ఘకాలికంగా రోజుకు కనీసం 15 గంటలు తీసుకోవాలి. ఊపిరితిత్తుల వ్యాయామం, ప్రాణాయా మం, లంగ్ మార్ఫిడీ చేయించుకోవాలి. ఇన్‌ఫ్లూయెంజా జీ వ్యాక్సిన్, న్యూమోకోకల్ వ్యాక్సిన్‌ను ఇప్పించాలి.

వ్యాధి లక్షణాలు

- ఆయాస పడడం, దగ్గు..
- ఛాతి బిగుసుకుపోవడం
- శ్వాసలో గురగుర శబ్దాలు
- పనులు చేసుకోలేకపోవడం





ప్రతి రోజు 50 కేసులు

కర్నూలు జీజీహెచ్‌కు ప్రతిరోజు ఓపీ 80 నుంచి 120 దాకా ఉంటుంది. ఈ కేసుల్లో 50 కేసులు సీవోపీడీ నుంచి వస్తుంటాయి. నడిస్తే ఆయాసం, దగ్గు, పిల్లకూతలుఈ వ్యాధి లక్షణాలు. సీవోపీడీ బాధితు లకు న్యూమోనియా, ఫ్లూఇన్‌ఫెక్షన్ల ముప్పు ఎక్కువ. **- డా. అంబర్‌నాథ్, అసిస్టెంట్ ప్రొఫెసర్, ఊపిరితిత్తుల విభాగం, కర్నూలు జీజీహెచ్**



సీవోపీడీ దీర్ఘకాలిక జబ్బు

సీవోపీడీ ఒక దీర్ఘకాలిక జబ్బు. ఇది బీడీ, సిగరెట్ తాగే వారిలో 90 శాతం జబ్బు వస్తుంది. ఎక్కువగా 40ఏళ్ల పైబడిన వారిలో కనిపిస్తుంది. వరల్డ్ సీవోపీడీ డేను పురస్కరించుకుని నగరంలోని న్యూనాగిరెడ్డి రెవెన్యూ కాలనీ శ్రీసాయి చెస్ట్ అండ్ అలర్జీ క్లీనిక్‌లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఉచితంగా స్పైరో మెట్రి పరీక్షలు నిర్వహించనున్నాం. **- డా.జి. కుళ్లాయప్ప, ఊపిరితిత్తుల వ్యాధుల నిపుణుడు**



ఇన్‌హెలర్లతోనే ఉపశమనం

సీవోపీడీ వ్యాధికి ఇన్‌హెలర్ల వాడకంతో ఉపశమనం లభిస్తుంది. ముఖ్యంగా ఆయాసం మొదలైనప్పుడు జాగ్రత్త పడాలి. పొగతాగడం మానేయాలి. సీవోపీడీ ఉన్న రోగులు ముఖ్యంగా ప్రొటీన్ డైట్ తీసుకోవాలి. మహిళలకన్నా పురుషుల్లు 40 ఏళ్ల పైబడిన వారిలో ఎక్కువగా వస్తుంది. **- డా.కే. శివకృష్ణ, ఊపిరితిత్తుల వ్యాధుల నిపుణుడు, శ్రీశ్వాస చెస్ట్ అండ్ అలర్జీ క్లీనిక్, కర్నూలు**

ముంచేసిన ఫేస్‌బుక్ పరిచయం!

- యువతీ, యువకుల మధ్య డబ్బు గొడవ
- ఆత్మహత్యకు యత్నించిన యువతి

పత్తికొండ, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ మోసాలకు గురై జీవితాలు కోల్పోతున్న వారు కొందరైతే డబ్బుపోగొట్టుకుని లబోదిబోమనేవారు ఎందరో? వాట్సాప్, ఫేస్‌బుక్ వంటి సోషల్ ప్లాట్‌ఫాంలో పరిచయాలు నమ్మకూడదంటూ నిత్యం పోలీసులు హెచ్చరికలు చేస్తున్నా మోసపోయేవారు మోసపోతూనే ఉన్నారు. అలా ఫేస్‌బుక్‌లో పరిచయమైన ఓ అబ్బాయిని మోసం చేసి ఏకంగా రూ.1.20 కోట్లు కాజేసింది పత్తికొండకు చెందిన ఓ యువతి. పత్తికొండ పట్టణానికి చెందిన ఓ యువతి ఫేస్ బుక్ ద్వారా తెలంగాణ రాష్ట్రం సంగారెడ్డి జిల్లా పఠాన్‌చెరువు మండలం ముత్తారం గ్రామానికి చెందిన సాయికి ఐదేళ్ల క్రితం పరిచయమైంది. సాయి స్థానికంగా కెమికల్‌కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. అయితే ఫేస్ బుక్‌లో పత్తికొండ యువతి తన చెల్లెలి ఫొటోతో ఫేస్‌బుక్ ఐడీ క్రియేట్ చేసుకుని చాటింగ్ చేస్తూ మోసగించింది.

ఆన్‌లైన్‌లోనే వారిద్దరి పరిచయం కాస్తా ఆర్థిక వ్యవహారాలకు దారి తీసింది. సదరు యువతి ఏవేవో కారణాలు చెబుతూ రూ.1.20 కోట్లను పలు దఫాలుగా సాయితో బ్యాంకు ఖాతాకు మళ్లించుకుంది. విషయం పసిగట్టిన బాధితుడు సాయి యువతిని పఠాన్‌చెరుకు పిలిపించుకుని తనకు రావాల్సిన మొత్తంపై అగ్రిమెంట్ రాయించుకున్నాడు. అగ్రిమెంట్ సమయం ముగుస్తున్నా డబ్బు రాకపోవడంతో నేరుగా పత్తికొండకు వచ్చి పోలీసులను ఆశ్రయించాడు. తాను చేసిన మోసం బయటప డటంతో యువతి మంగళవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. కుటుంబ సభ్యులు ఆమెను పత్తికొండ ఆసుపత్రికి తరలించారు. అక్కిడి నుంచి మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు. ఈ విషయంపై యువతి తండ్రి మాట్లాడుతూ తమ కుమార్తె డబ్బు తీసుకున్న విషయం నిజమేనని, అయితే అప్పటికే పెద్దమొత్తంలో డబ్బు ఇచ్చేచేశామని చెప్పాడు. అయినప్పటికీ యువకుడు సాయి నుంచి వేధింపులు అధికం కావడంతోనే తన కుమార్తె ఆత్మహత్యకు యత్నించిందని వాపోయాడు. ఈ ఘటనపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

వేధింపుల కేసు నమోదు

బనగానపల్లె, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నందివర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలోని నందివర్గానికి చెందిన షేక్ దస్తగిరి కుమార్తె షేక్‌మాబూచాంద్‌ను ఆమె భర్తషేక్ అమీర్‌బాషా, అత్త లతీప్ ఉన్నీసా, ఆడబిడ్డ రషీదాబీ అదనపు కట్నం కోసం శారీరకంగా మానసికంగా హింసిస్తున్నట్లు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటసుబ్బయ్య మంగళవారం తెలిపారు. షేక్ మాబూచాంద్‌కు 8 సంవత్సరాల క్రితం ఆళ్లగడ్డ మండలం చింతకుట గ్రామానికి చెందిన షేక్ అమీర్‌బాషాతో వివాహమైంది. వివాహ సమయంలో రూ. 2లక్షల నగదు, 5తులాల బంగారు కట్నం ఇచ్చారు. అదనంగా ఆమె తండ్రి పేరు మీద ఉన్న మరో అర ఎకరా పొలం తీసుకొని రావాలని అత్తింటివారు వేధిస్తుండడంతో బాధితురాలు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు వారి ముగ్గురిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కేసీ కెనాల్‌లో మహిళ మృతదేహం



వెంకట లక్ష్మమ్మ (ఫైల్)

శిరివెళ్ల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): శిరివెళ్ల మండల పరిధిలోని కేసీ కెనాల్ కామినేనిపల్లె 16వ లాక్ వద్ద ఓ మహిళ మృత దేహం మంగళవారం లభ్యమైంది. స్థానికుల సమాచారం అందించడంతో పోలీసులు మృత దేహాన్ని కాల్వలో నుంచి బయటకు తీయించారు. మృతు రాలు గోవిందపల్లె గ్రామానికి చెందిన మేగల వెంకట లక్ష్మమ్మ(47)గా గుర్తించారు. వెంకట లక్ష్మమ్మ మానసికస్థితి కొంత కాలంగా సరిగా లేదని.. ఈ నెల 17న రాత్రి ఇంట్లో నుంచి వెళ్లిపోయినట్లు భర్త లక్ష్మయ్య పోలీసులకు తెలిపారు. ప్రమాదవశాత్తు కేసీ కాల్వలో పడి మృతి చెంది ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. వెంకట లక్ష్మమ్మ మృతదేహాన్ని పంచనామా నిమిత్తం నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతురాలి భర్త లక్ష్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చిన్న పీరయ్య తెలిపారు.

ప్రమాదంలో పండ్ల వ్యాపారి మృతి

- మరో ముగ్గురికి తీవ్ర గాయాలు



ఉలిగమ్మ (ఫైల్)

ఆదోని రూరల్ నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆదోని మండలం పెద్దతుంబళం- కోసిగి ప్రధాన రహదారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కోసిగికి చెందిన పండ్ల వ్యాపారి ఉలిగమ్మ(50)మృతి చెందింది. ఆమె రోజూ కోసిగి నుంచి ఆదోనికి వచ్చి వివిధ రకాల పండ్లను విక్రయించి తిరిగి సొంత ఊరికెళ్లేది. ఈ క్రమంలో మంగళవారం ఆటోలో సదరు ఉలిగమ్మ ఆదోనికి బయల్దేరింది. వీరు ప్రయాణిస్తున్న ఆటో పెద్దతుంబళం క్రాస్ వద్దకు రాగానే అదుపుతప్పి ఆటో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఉలిగమ్మతోపాటు ఇందు, సోమక్క, పార్వతి తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను ఆదోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఉలిగమ్మ మృతి చెందింది. మృతురాలికి ఏడుగురు ఆడపిల్లలు, మగ పిల్లవాడు ఉన్నారు. భర్త వెంకటేష్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహేష్ కుమార్ తెలిపారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

క్రిష్ణగిరి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మన్నెకుంట గ్రామానికి చెందిన కొణిదేల వెంకట్రాముడు (44) అప్పుల బాధ తాళలేక పురుగుల మందు తాగి సోమవారం ఆత్మహత్య చేసుకు న్నాడు. పంటల సాగు కోసం చేసిన అప్పులు తీర్చలేననే నిరాశకు గురై సోమవారం తన పొలంలో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు కోడుమూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు ధృవీకరించారు. భార్య నాగలక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మల్లికార్జున తెలిపారు.



వెంకట్రాముడు మృతదేహం

డ్రిప్ ఇరిగేషన్‌కు కేంద్రం నిధులు

కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): సూక్ష్మ సేద్యానికి కూటమి ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తెచ్చి ఉమ్మడి కర్నూలు జిల్లాకు రూ.73.06కోట్లు నిధులను భరించేలా అనుమతి తెచ్చింది. కర్నూలు జిల్లాలో 15వేల హెక్టార్లు, నంద్యాల జిల్లాలో 15వేల హెక్టార్లలో ఈ ఏడాది డ్రిప్పు సేద్యాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసింది. ఐదెకరాల్లోపు రైతులకు 90 శాతం ఐదెకరాలకు పైబడి పది ఎకరాలలోపు 70 శాతం సబ్సిడీతో సూక్ష్మ సేద్యం పరికరాలను రైతుల పొలాల్లో ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని ఏపీఎంఐపీ పీడీ ఉమాదేవి మంగళవారం తెలిపారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో లక్ష్యం మేరకు డ్రిప్ ఏర్పాటు కోసం రూ.134.89 కోట్లు ఖర్చు అవుతుందని, ఇందులో కేంద్రం రూ.73.06 కోట్లు భరిస్తుండగా, రాష్ట్ర ప్రభుత్వం రూ.48.70 కోట్లు ఇస్తున్నట్లు పీడీ ఉమాదేవి తెలిపారు. రైతులు తమ వాటా రూ.13.13 కోట్లు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. వివరాలకు 08518-279724, 7995078264, 6303613097 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

బనగానపల్లెలో దారుణ హత్య

- ముగ్గురు వ్యక్తులు కత్తులతో దాడి
- ఆస్తి తగాదాలే కారణం



శ్రీరాములు (ఫైల్)

బనగానపల్లె, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆస్తి తగాదాలతో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురైన సంఘటన బనగానపల్లె పట్టణంలో మంగళవారం చోటు చేసుకుంది. బనగానపల్లె మున్సిపల్ పరిధిలోని బానుముక్కలకు చెందిన చిలకన్నగారి శ్రీరాములు(44) అనే వ్యక్తిని మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో ముగ్గురు వ్యక్తులు కత్తులతో దాడి చేసి హతమార్చారు. ఇందుకు సంబంధించిన వివరాలు పోలీసుల కథనం మేరకు... అన్నకుమారులైన వెంకటగిరి, వెంకటేశ్వర్లుతో శ్రీరాములుకు గతంలో పొలం తగాదాలు ఉండేవి. పొలం తగాదాను పెద్దల సమక్షంలో పరిష్కరించు కున్నారు. అయితే ఓ ఇంటి విషయంపై కూడా ఇరు కుటుంబాల మధ్య మళ్లీ వివాదం చెలరేగింది. దీంతో శ్రీరాములుపై అన్నకుమారులు వెంకటగిరి, వెంకటేశ్వర్లు కక్ష పెంచుకున్నారు. ఈ క్రమంలో మంగళవారం తన ఇంటి వద్ద మోటారు సైకిల్ పెట్టి ఇంట్లోకి వెళ్తున్న శ్రీరాములుపై అన్న కుమారులు వెంకట గిరి, వెంకటేశ్వర్లు.. గొల్ల రామమద్దిలేటి అనే వ్యక్తితో కలసి విచక్షణా రహితంగా కత్తులతో దాడి చేశారు. కుటుంబ సభ్యులు గుర్తించి శ్రీరాములును మెరుగైన వైద్యం కోసం నంద్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందాడు. శ్రీరాములు తల్లి సుబ్బమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

సీసీ రోడ్ల నిర్మాణంలో నాణ్యత పాటించండి

- క్వాలిటీ కంట్రోల్ డీఈ రవీంద్రారెడ్డి



సీసీరోడ్డు నాణ్యతను తనిఖీ చేస్తున్న ఇంజనీర్లు

కర్నూలు రూరల్, నవంబరు19(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీరాజ్‌శాఖ సీసీ రోడ్ల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని క్వాలిటీ కంట్రోల్ డివిజనల్ ఇంజనీర్ రవీంద్రారెడ్డి అధికారులను ఆదేశించారు. కర్నూలు మండలంలోని జి. శింగవరంలో రూ.10లక్షలు, బావాపురంలో రూ.49లక్షలు, బి.తాండ్రపాడులో రూ.15లక్షలు వ్యయంతో పంచాయతీ రాజ్‌శాఖ అధికారుల పర్యవే క్షణలో జరుగుతున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను మంగళవారం క్వాలిటీ కంట్రోల్ అధికారు లు పరిశీ లించారు. నిర్మాణ పనుల్లో నాణ్యత లేకుంటే సహించ బోమని డీఈ సూచించారు. వారి వెంట కర్నూలు మండల పంచాయతీ రాజ్‌శాఖ ఏఈ ముక్తార్‌బాషా, క్వాలిటీ కంట్రోల్ ఏఈ విజయభాస్కర్ ఉన్నారు.

వస్తుసేవల్లో వినియోగదారులకు ఫోరం రక్షణ

- జిల్లా తూనికలు, కొలతల శాఖ అధికారి అనిత



మాట్లాడుతున్న అనిత

పాణ్యం, నవంబరు19 (ఆంధ్రజ్యోతి): వస్తు సేవల్లో వినియోగదారుడు మోసపోయినపుడు వినియోగ దారుల రక్షణ ఫోరం న్యాయం చేస్తుందని జిల్లా తూనికలు, కొలతల శాఖ అధికారి అనిత పేర్కొన్నారు. పాణ్యం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన తూనికలు, కొలతలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దుకాణాలలో తూనికలు, కొలతల పరికరాల ద్వారా జరిగే మోసాలను వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వినియోగదారుల సంఘం అధ్యక్షుడు సయ్యద్ అమీర్‌బాషా, హెచ్‌ఎం మేరీసునీత, ఫోరం సభ్యులు రజనీకాంత్, సాంకేతిక నిపుణులు శ్రీరాములు పాల్గొన్నారు.

ఆటో ప్రమాదంలో మహిళ మృతి

- పొగ మంచు కారణంగా..



ఉలిగమ్మ (ఫైల్)

కోసిగి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కోసిగి 1వ వార్డుకు చెందిన దళవాయి మంగమ్మ (50) ఆటో బోల్తా పడి మృతి చెందింది. ఈ ఘటన మంగళవారం జరిగింది. కోసిగి నుంచి ఆటోలో ఉదయం 5.30 గంటలకు ఆదోనికి వెళ్తుం డగా.. పెద్ద తుంబళం గ్రామ సమీపంలో పొగ మంచు కారణంగా రోడ్డు కనపడకపోవడంతో ఎదురుగా వస్తున్న ఆవులను తప్పించబోయి ఆటో బోల్తా పడింది. ప్రమాదంలో ఉలిగమ్మ తీవ్ర రక్తగాయాలకు గురైంది. ఆదోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందింది. ఆమె కూతురు పార్వతి, డ్రైవర్ మహదేవ గాయ పడ్డారు. పెద్ద తుంబళం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారరు.

ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ మోసం

- ముగ్గురి అరెస్ట్

గుత్తి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ నిరుద్యోగ యువకులను మోసగించిన కేసులో సోమవారం రాత్రి ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. గుత్తిఆర్ఎస్‌కు చెందిన కాలవ నిఖిల్‌తో పాటు మరికొంత మంది యువకులకు ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ కర్నూలు నగరానికి చెందిన పెద్దిశెట్టి మేరీ సునీత, మరికొందరు నమ్మించారు. దీంతో ఆ యువకులు సుమారు రూ.1.50 లక్షలు చెల్లించారు. వీరికి ఉద్యోగాలు ఇప్పించడం ఆలస్యం కావడంతో ఒత్తిడి చేశారు. దీంతో ఇద్దరికి నకిలీ జాయినింగ్ లెటర్లు ఇప్పించారు.

దీన్ని తీసుకుని ఆ యువకుడు చీరాల మండల తహసీల్దారు కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా చేరేందుకు వెళ్లాడు. అది నకిలీ జాయినింగ్ లెటర్ అని తెలుసుకున్నాడు. దీంతో డబ్బులు వాపసు ఇవ్వాలని ఒత్తిడి చేశాడు. డబ్బులు ఇవ్వకపోవడంతో నిఖిల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఎట్టకేలకు మోసం చేసిన పెద్దిశెట్టి మేరీ సునీత, అన్నమయ్య జిల్లా గుర్రం కొండ మండలం ఎల్లంపల్లికి చెందిన గుర్రం ప్రసాద్‌రెడ్డి, తంబళ్లపల్లి మండలం కుక్కరాజుపల్లికి చెందిన షేక్ బాబ్‌జాన్ సాహెబ్‌ను సోమవారం రాత్రి అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. దీంతో రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

బియ్యం బ్లాక్ మార్కెట్‌కు..!



ఎండీయూ వాహనం

(5వ పేజీ తరువాయి)

గ్రామ స్థాయి నుంచే రేషన్ మాఫియా యథేచ్ఛగా సాగుతోంది. ప్రతి నెలా మొదటి తేదీలోపు సివిల్ సప్లైస్ గోదాముల ద్వారా నిర్దేశిత రేషన్ షాపులకు పీడీఎస్ బియ్యం సరఫరా అవుతోంది. అయితే స్టాక్‌ను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సిన అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదని ఆరోపణలు ఉన్నాయి. రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్నారనీ ఫిర్యాదులు వెళ్లినా అధికారులు పట్టించుకోవడం లేదని తెలుస్తోంది. ప్రభుత్వం పేదలకోసమని భారీగా ఖర్చు చేస్తుంటే.. దానిని రేషన్ మాఫియా తమకు ఆదాయం వనరుగా మార్చుకుంది. రేషన్ మాఫియా చేసే దందాను పోలీసులు, రెవెన్యూ అధికారులు అనేకసార్లు పట్టుకుని కేసులు నమోదు చేసినా, జరిమానాలు విధించిన మళ్లీ అదే తరహా అక్రమ వ్యాపారానికి రేషన్ మాఫియా సిద్ధపడుతోంది.

పర్యావరణ అనుకూలంగా ఈఈఎస్ఎల్ పరికరాలు

నంద్యాల రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి); పర్యావరణానికి ఈఈఎస్ఎల్ పరికరాలు అనుకూలమని నంద్యాల జిల్లా విద్యుత్ ఎస్ఈ సుధాకర్‌కుమార్ తెలిపారు. మంగళవారం నంద్యాల డివిజన్ విద్యుత్ కార్యాలయంలో ఈఈఎస్ఎల్ ఊర్జావీర్ ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో రాష్ట్ర ప్రభుత్వం ఈఈఎస్ఎల్ కంపెనీతో అనుసంధానం చేసుకుందని అన్నారు. వీటివల్ల ప్రజలకు విద్యుత్ భారం తగ్గుతుందన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 1145 మందిని ఊర్జా వీర్ యాప్‌లో నమోదు చేయించి రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉన్నామన్నారు. టెక్నికల్ నాగేశ్వరరావు, ఈఈలు శ్రీనివాసులురెడ్డి, జయశంకర్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఎస్పీతో విద్యార్థుల ముఖాముఖి

నంద్యాల రూరల్, నవంబరు19 (ఆంధ్రజ్యోతి): నంద్యాల ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణాతో ఆర్జీఎం ఇంటర్‌నేషనల్ పాఠశాల విద్యార్థులు ముఖాముఖి చర్చల్లో పాల్గొన్నారు. ఆర్జీఎం పది కార్యక్రమాల రూపకల్పనలో భాగంగా మంగళవారం విద్యార్థులు గంట పాటు ఎస్పీతో నేరాల వివరాలు, శిక్షలు, వేధింపులు తదితర అంశాలపై ఎస్పీని అడిగి తెలుసుకున్నారు. ఎస్పీ విద్యార్థులకు సైబర్ నేరాలు, బాల కార్మిక చట్టాలు, సాంకేతిక వినియోగం, అవినీతి నిర్మూలన, మహిళలపై వేధింపులు, అజాగ్రత్తగా వాహనాలు నడపడం నేరాల నిర్మూలనపై పోలీసుల పాత్ర వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా సైబర్ నేరాలపైపూర్తి అవగాహన ఉండాలని ఎస్పీ విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు గురుసాయి కౌశిక్, చేతన్‌రెడ్డి, సాధన, అక్షరాసింగ్, భువనేశ్వర్‌రెడ్డి, శశాంత్, ధార్మిక, నిఖిల్, సాక్షిత్, భానుతేజ, తన్విక పాల్గొన్నారు.


రాష్ట్ర ఉత్తమ అధ్యాపకుడికి సత్కారం



రాష్ట్ర ఉత్తమ అధ్యాపక అవార్డు గ్రహీత నజీర్ అహమ్మద్‌ను సత్కరిస్తున్న సహచర అధ్యాపక బృందం

బండిఆత్మకూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉత్తమ అధ్యాపకుడు షేక్ నజీర్ అహమ్మద్‌ను సహచర అధ్యాపక బృందం ఘనంగా సత్కరించింది. మంగళవారం బండిఆత్మకూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ వెంకటనారాయణ అధ్యక్షతన సత్కార కార్యక్రమం నిర్వహించారు. డీవీఈవో డాక్టర్ సునీత మాట్లాడుతూ వృక్ష శాస్త్రంలో ఎంతో మంది విద్యార్థులను తీర్చిదిద్దడంతో పాటు ఎన్ఎస్ఎస్ సేవా కార్యక్రమాల్లో ఎన్నో ఏళ్లు నజీర్ అహమ్మద్ కష్టపడ్డారన్నారు. ప్రభుత్వం ఉత్తమ అధ్యాపకుడిగా ఎంపిక చేయడం ఎంతో సంతోషంగా ఉందని పలువురు అధ్యాపకులు అన్నారు. అలాగే 2023,24 వవిద్యా సంవత్సరంలో అత్యధిక మార్కులు సాధించిన కల్పన, కరిష్మా, సుప్రజలకు స్థానిక రిటైర్డ్ ఉపాధ్యాయులు నారాయణ, లక్ష్మణస్వామి రూ.1500 చొప్పున నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.

శ్మశాన సమస్యను పరిష్కరించండి



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

పాములపాడు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని క్రిష్ణరావుపేటలోని శ్మశాన సమస్యను పరిష్కరించాలని సీపీఐ నాయకులు రమేశ్ కలెక్టర్‌కు వినతి పత్రం అందచేశారు. మంగళవారం హైవే పనుల సమస్యల పరిష్కరించేందుకు వచ్చిన కలెక్టర్‌ను కలిసి సమస్యలను విన్నవించారు 60 సెంట్లలో ఉన్న ముస్లింల శ్మశాన భూమికి పరిహారం చెల్లించకుండా కాలువలు తవ్వారని, అలాగే రుద్రవరం గ్రామంలో పాఠశాలకు సంబంధించి నిధులు వచ్చిన నూతన పాఠశాల నిర్మాణ పనులు చేపట్టడం లేదన్నారు. హైవే నిర్మాణ పనుల్లో భూములు కోల్పోయిన బాధితులకు త్వరగా పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

సమస్యలు పరిష్కరిస్తాం

రోడ్డు నిర్మాణానికి సహకరించండి

పదిరోజుల్లో బాధితులకు పరిహారం: కలెక్టర్ రాజకుమారి



రుద్రవరంలో భూ బాధితులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

పాములపాడు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రగూడూరు గ్రామం నుండి క్రిష్ణరావుపేట వరకు పది కిలోమీటర్ల పరిధిలోని హైవే నిర్మాణ పనుల్లో భూసమస్యలను పరిష్కరిస్తామని కలెక్టర్ రాజకుమారి, జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్ బాధితులకు హామీ ఇచ్చారు. మంగళవారం ఎర్రగూడూరు గ్రామంలోని శివార్లలో గల శివాలయాన్ని కూల్చివేయాలని, ఇందుకు సంబంధించిన పరిహారం రూ. 17 లక్షలు త్వరలో అందిస్తామని తెలిపారు. శివాలయం వెనుక ఉన్న ప్రభుత్వభూమిని ఆలయానికి కేటాయించాలని నిర్వాహకులు కలెక్టర్‌కు విన్నవించుకున్నారు. అలాగే నాగార్జునరెడ్డికి చెందిన బావి పూడ్చివేసి, విస్తరణ పనులు ప్రారంభించాలని ఆదేశించారు. పాములపాడులో శ్రీ శారద స్కూల్ క్రీడ మైదానంలో మొదట 38 సెంట్లు హైవేలో పోతాయని, ఆ తర్వాత అధికారులు ఎకరా అంటున్నారని, దీంతో తాము కోర్టును ఆశ్రయించామని పాఠశాల నిర్వాహకుడు శ్రీనివాసులు కలెక్టర్‌కు తెలిపారు. రుద్రవరం, క్రిష్ణరావుపేట గ్రామాలలో కల్లాల సర్వేనెంబర్లు పట్టాలలో ఒక నెంబరు, ఆన్‌లైన్‌లో మరొక నెంబర్ ఉన్నాయని, దీంతో పరిహారం ఇవకవడంలో ఆలస్యమవుతోందని కలెక్టర్, జేసీ దృష్టికి తహసీల్దార్, సర్వేయర్, వీఆర్వోలు తీసికెళ్లారు. ఇంత చిన్న పనులు కూడా చేయడం లేదని కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వీరి వెంట పీడీ పద్మ, ఆర్డీవో జ్యోతి, హైవే అధికారులు పాల్గొన్నారు.

పనివేళల మార్పు సరికాదు



మాట్లాడుతున్న సాంబశివుడు

నంద్యాల, నవంబరు 19 : (ఆంధ్రజ్యోతి): ఉన్నత పాఠశాలల పనివేళలు మార్పు చేయడం సరికాదని అలాంటి అసంబద్ధమైన ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని ఏపీటీఎఫ్-1938 రాష్ట్ర అకడమిక్ కమిటీ సభ్యుడు సాంబశివుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి నగిరి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. మంగళవారం ఏపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో వారు మాట్లాడుతూ ఉన్నత పాఠశాలలకు గ్రామీణ ప్రాంత విద్యార్థులు సగటున 5కిమీ.పైబడి దూరం నుంచి కాలినడకన, ఆటో, బస్సుల ద్వారా వస్తున్నారని విద్యార్థుల భద్రత దృష్ట్యా పాఠశాలల పనివేళలు పెంచడం మంచిది కాదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పనివేళలో గతంలో ఉదయం 9.45నుంచి సాయంత్రం 4.40వరకు ఉండేవని గత ప్రభుత్వాలు సమీక్షించి ఉదయం 9నుంచి సాయంత్రం 4వరకు పనిచేసేలా సవరించాయని గుర్తు చేశారు. తాజా నిర్ణయంతో విద్యార్థుల డ్రాపౌట్స్ పెరుగుతుందని, విద్యార్థుల సంసిద్ధత, స్థానిక పరిస్థితులు, శాస్త్రీయ విధానానికి, మనో విశ్లేషణ సిద్ధాంతానికి వ్యతిరేకమన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు పుల్లయ్య, రవి, పవన్ కుమార్, మునిస్వామి, శేషయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలి

పగిడ్యాల,నవంబరు 19,(ఆంధ్రజ్యోతి) : సచివాలయ సిబ్బంది నిర్వహిస్తున్న ఇళ్ల జియోటాగింగ్ సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీవో సుమిత్రమ్మ సిబ్బందికి సూచించారు. పగిడ్యాలలోని సచివాలయాన్ని మంగళవారం తనిఖీ చేశారు. అధికారుల ఆదేశాల మేరకు సర్వేను రెండు రోజులలోపు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ నాగేంద్రమయ్య, పంచాయితీ కార్యదర్శి ఉపేంద్రారెడ్డి ఉన్నారు.

అగ్నిప్రమాదంలో హోటల్ దగ్ధం

ఆత్మకూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణంలోని నంద్యాల టర్నింగ్‌లో మంగళవారం తెల్లవారుజామున విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంతో అబ్దుల్లా అనే వ్యక్తికి చెందిన హోటల్ దగ్ధమైంది. ఈ ఘటనలో హోటల్‌లోని సామాగ్రితో పాటు సరుకులు కూడా అగ్నికి ఆహుతయ్యాయి. సమీపంలోనే ఉన్న అగ్నిమాపక కేంద్రం సిబ్బందికి అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేశారు. సుమారు రూ.1.5లక్షల నష్టం వాటిల్లినట్లు బాధితుడు అబ్దుల్లా వాపోయారు.

ప్రజల అభిప్రాయాలను గౌరవించాలి



రైతుల అభిప్రాయాలను తెలుసుకుంటున్న ఆర్డీవో విశ్వనాథ్

నంద్యాల రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రజల అభిప్రాయాలను గౌరవించాలని కానాల ప్రజలు కోరారు. మంగళవారం నంద్యాల మండలం కానాల గ్రామంలో నంద్యాల జమ్మలమడుగు 167కే జాతీయ రహదారి ఏర్పాటుపై నంద్యాల ఆర్డీవో చల్లా విశ్వనాథ్ రైతులతో అభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించారు. రహదారి కానాల గ్రామ సమీపంలో వెళుతున్నందున అభ్యంతరాలు ఏమైనా ఉంటే తెలియజేయాలని కోరారు. పాతదారి ఎలా ఉంటే అలాగే భూములను తీసుకుని జాతీయ రహదారి ఏర్పాటు చేయాలని కోరారు. గతంలో గ్రామంలోని కొందరు స్వార్థంవల్ల రహదారిని మలుపులు తిప్పుతూ రాజకీయంగా చేసిన ప్రయత్నాలను అధికారులు నిలువరించాలని తెలిపారు. ప్రజాభీష్టానికి వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకుంటే పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. అభిప్రాయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఆర్డీవో పేర్కొన్నారు. ఆర్డీవో వెంట నంద్యాల తహసీల్దార్ ప్రియదర్శిని. డీటి రామచంద్రరావు.ఆర్ఐ నాగరాజు తదితరులు ఉన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన

నందికొట్కూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): సేఫ్ ఇండియా కార్యక్రమంలో భాగంగా నందికొట్కూరు పట్టణంలోని మద్దూర్ నగర్‌లో ఉన్న శ్రీ చైతన్య స్కూల్‌లో విద్యార్థిని విద్యార్థులకు రోడ్డు సేఫ్టీ ఈజ్ కమ్యూనిటీ కన్సర్ అనే నినాదంతో రోడ్డు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులతో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించడం వల్ల జరిగే పరిణామాలపై అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నిబంధనలు మీరు పాటిస్తూ మీ తల్లిదండ్రులకు తెలియజేయాలని అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థిని విద్యార్థులతో పాఠశాల నుంచిప టేల్ సెంటర్ వరకు స్పీడ్ థ్రిల్ బట్ ఇట్ కిల్స్, సేఫ్టీ ఫస్ట్ స్పీడ్ నెక్స్ట్ అనే నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీ చైతన్య విద్యా సంస్థల ఏజీఎం సురేష్, ఆర్ఐ కోటయ్య చౌదరి, పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలు అందరి బాధ్యత

● మున్సిపల్ కమిషనర్



మద్దమ్మను సన్మానిస్తున్న మున్సిపల్ కమిషనర్, ప్రధానోపధ్యాయులు, విద్యార్థులు

నందికొట్కూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంటికి వ్యక్తిగత మరుగుదొడ్లు ఉండాలని మున్సిపల్ కమిషనర్ బేబి అన్నారు. మంగళవారం పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో డెటాల్ బనేగా స్వస్థ ఇండియా కార్యక్రమంలో భాగంగా గ్రామాల సార్ఫ్ సంస్థ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ పిడతల పుల్లన్న ఆధ్వర్యంలో ప్రపంచ టాయిలెట్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. బాలికల ఉన్నత పాఠశాలలో మరుగుదొడ్లు శుభ్రం చేసే ఆయా మద్దమ్మను మున్సిపల్ కమిషనర్ సన్మానించారు. బహిరంగ మలవిసర్జన నిర్మూలన వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం అందరి బాధ్యత అని ఆమె అన్నారు. పిల్లలకు ఎస్ఏ రైటింగ్, డ్రాయింగ్ పరీక్షలు నిర్వహించి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో సుభానీ బాషా, హెచ్.ఎం.పార్వతమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మిడుతూరు: ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా మంగళవారం మిడుతూరు మండల పరిషత్ కార్యాలయంలో మరుగుదొడ్ల వినియోగంపై ప్రజలకు అవగాహన కార్యక్రమం ఎంపీడీవో దశరథరామయ్య, ఈవోఆర్డీ సంజన్న, ఆర్‌డబ్ల్యూస్ ఏఈ విశ్వనాథ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏవో సురేష్. ఏపీవో జయంతి సిబ్బంది పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

పాములపాడు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేంపెంట గ్రామంలో టీడీపీ కార్యకర్త చిన్న నాగన్న అనారోగ్యంతో మృతి చెందాడు. మాజీ సర్పంచ్ టీడీపీ నాయకురాలు రామసుబ్బమ్మ మృతుడి కుటుంబానికి ఐదువేల రూపాయల ఆర్థిక సహాయం అందించి ఓదార్చారు. టీడీపీలో చురుగ్గా పని చేసేవాడని పార్టీ పరంగా మృతుని ఆదుకుంటామని తెలిపారు.

వడ్డెర్లను ఎస్టీ జాబితాలో చేర్చాలి

నంద్యాల, నవంబరు 19 : (ఆంధ్రజ్యోతి): వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలని వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడు వడ్డె చక్రధర్ మంగళవారం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల్లో పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి వడ్డెరలు రాష్ట్రంలో పడుతున్న కష్టాలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావడం, వడ్డెరలకు అండగా నిలవాలని టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబునాయుడు వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చడానికి గతంలో అసెంబ్లీలో తీర్మానం చేయాలని వేసిన సత్యపాల్ కమిటీని గుర్తుచేస్తూ ఆ కమిటీని పునరుద్ధరించాలని ఆమె కోరడంపై వడ్డెర సంఘం నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

గడివేముల: కూటమి ప్రభుత్వంతోనే వడ్డెరల అభివృద్ధి సాధ్యమని అఖిలభారత్ వడ్డె ఓబన్న సేవా సమితి జిల్లా అధ్యక్షుడు బీవీఎన్ రాజు అన్నారు. మంగళవారం ఆయన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాల్లో పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే సింధూరారెడ్డి వడ్డెరల ఆర్థిక, సామాజిక పరిస్థితులపై అసెంబ్లీలో గళమెత్తారని అన్నారు. వడ్డెరలను అండగా నిలిచేందుకు గత టీడీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సత్యపాల కమిటీని నియమించారని అన్నారు. ప్రస్తుతం సత్యపాల కమిటీని పునరుద్ధరించాలని అన్నారు.

రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో సత్తా

నంద్యాల, నవంబరు 19 : (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో నంద్యాలకు చెందిన క్రీడాకారులు పతకాలు సాధించారని జిల్లా కరాటే సంఘం అధ్యక్షుడు, ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డా.రవికృష్ణ తెలిపారు. మంగళవారం నంద్యాల క్రీడా సమాఖ్య కార్యాలయంలో విజేతలకు అభినందన సభ ఏర్పాటు చేశారు. రవికృష్ణ మాట్లాడుతూ ఏపీ స్పోర్ట్స్ కరాటే సంఘం ఆధ్వర్యంలో విజయవాడలో ఆదివారం జరిగిన రాష్ట్ర స్థాయి కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో శాంతినికేతన్ పాఠశాలకు చెందిన హరిప్రియ, వేణుకుమార్ వెండిపతకాలు, జయవర్ధన్ కాంస్యపతకం, చైతన్య పాఠశాలకు చెందిన రామసాయివర్ధిని కాంస్య పతకం సాధించారన్నారు. ఈ సందర్భంగా విజేతలను, కరాటే మాస్టర్లు బాలకృష్ణ, నవీన్‌లను అభినందించారు.

కంప్యూటర్ విద్యను సద్వినియోగం చేసుకోండి



కంప్యూటర్ విద్యను ప్రారంభిస్తున్న దృశ్యం

ఆత్మకూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణ శివార్లలోని పెద్ద మదరసా మదీన తుల్ ఉలూమ్ అరబిక్ కళాశాల విద్యార్థులు కంప్యూటర్ విద్యను సద్వినియోగం చేసుకోవాలని కళాశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షులు ఎంఏ.రషీద్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక అరబిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన కంప్యూటర్ విద్యను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అరబిక్ విద్యతో పాటు ఆధునిక టెక్నాలజీతో కూడిన కంప్యూటర్ విద్యను విద్యార్థులకు నేర్పించాలన్న సంకల్పంతోనే కంప్యూటర్ విద్యను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. ఆరు నెలల పాటు కంప్యూటర్ శిక్షణ అందించి అర్హత సాధించిన విద్యార్థులకు ధృవీకరణ పత్రాలను అందజేసినట్లు వివరించారు. కార్యక్రమంలో ముర్తుజా మౌలానా, అబ్దుల్ వహబ్, సోఫిసా, హఫీజ్ సాహెబ్, సయ్యద్‌మీరు తదితరులు ఉన్నారు.

బాలిక కోసం ముమ్మరంగా గాలింపు

వెలుగోడు నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): వెలుగోడు మండలంలోనని అయ్యవారిపల్లి గ్రామ సమీపంలోని నిప్పుల వాగులో గల్లంతైన బాలిక భవ్యశ్రీ కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. మంగళవారం వెలుగోడు మత్స్యకారులు పుట్టి సాయంతో నిప్పుల వాగులో సంతజూటూరు వరకు గాలింపు చర్యలు చేపట్టారు. అయినప్పటికీ బాలిక ఆచూకీ లభ్యం కాక పోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు

దుర్గా భోగేశ్వర ఆలయంలో డీఎఫ్‌వో పూజలు

గడివేముల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): దక్షిణ కాశీగా పేరు గాంచిన మండలంలోని గడిగరేవుల గ్రామ సమీపంలో వెలసిన దుర్గాభోగేశ్వర ఆలయంలో మంగళవారం జిల్లా ఫారెస్టు అధికారి నాగమనేశ్వరి ప్రత్యేక పూజలు చేశారు. దుర్గాభోగేశ్వరుడికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి కుంకుమార్చన చేశారు. ఆలయ అర్చకులు శ్యామ్‌సుందర్‌శర్మ జిల్లా ఫారెస్టు అధికారిణికి తీర్థప్రసాదాలు అందజేశారు.

నైతిక విలువలతోనే గౌరవం..

నంద్యాల రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : నైతిక విలువలతోనే జీవితానికి గౌరవం దక్కుతుందని జిల్లా విద్యాశాఖాధికారి జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నంద్యాల మండలం చాపిరేవుల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత సాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమ శిక్షణతో, ఉన్నత లక్ష్యాల వైపు అడుగులు వేయాలని సూచించారు. ప్రైమరీ స్కూల్ కాంప్లెక్స్‌లోని సమావేశంలో పాల్గొని ఉపాధ్యాయులకు మార్గ నిర్దేశం చేశారు.

మరుగుదొడ్ల నిర్మాణానికి చర్యలు



ఆర్టీసీ స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్టీసీ డీఎం, ఎంపీడీవో

పాణ్యం, నవంబరు19 (ఆంధ్రజ్యోతి) : పాణ్యం ఆర్టీసీ బస్టాండు ఆవరణలో మరుగుదొడ్ల నిర్మాణానికి చర్యలు చేపట్టినట్లు నంద్యాల ఆర్టీసీ డీఎం గంగాధర్ పేర్కొన్నారు. మంగళవారం పాణ్యం ఆర్టీసీ స్థలాన్ని సర్వే చేసి, నిర్మాణాలకు అవసరమైన స్థలం మ్యాపులను ఎంపీడీవో ప్రకాష్‌కుమార్‌కు అందజేశారు. ఆర్టీసీ శాఖ అందించిన నిర్మాణ మ్యాపులను ఆర్‌డబ్ల్యూఎస్ శాఖకు అందించి నిర్మాణాల కొలతలు నిబంధనల మేరకు అనువుగా ఉన్నాయా లేవా అన్నది నిర్ణయిస్తామన్నారు. గత పదేళ్లుగా ప్రయాణికులు మరుగుదొడ్లు, తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నారని నాయకులు ఎమ్మెల్యే గౌరు చరిత దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే స్పందించి ఆర్టీసీ అధికారులతో మాట్లాడి బస్టాండ్‌లో అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజరు మద్దిలేటి నాయుడు, సూపరింటెండెంట్ రూప్లానాయక్, ఆర్టీసీ ఏఈ ఐతాబాబు, గ్రామ పంచాయతీ కార్యదర్శి ఆనందరావు, టీడీపీ, జనసేన, ఏఐఎఫ్‌బీ నాయకులు పాల్గొన్నారు.

రహదారులను నిర్మించండి



వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

మిడుతూరు, నవంబరు 19:(ఆంధ్రజ్యోతి): పంట పొలాలకు వెళ్లేందుకు రహదారులు లేవని, వెంటనే నిర్మించాలని టీడీపీ మండల కన్వీనర్ కాతా రమేష్ రెడ్డి, నాయకులు, రైతులు అధికారులను కోరారు. మంగళవారం మిడుతూరు గ్రామంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో మంగళవారం ఉపాధి హామీపథకం పనులపై సోషల్ ఆడిట్ జరిగింది. ఈ ఆడిట్‌కు డ్వామా పీడీ జనార్దన్‌రావు, ఎమ్అండ్‌డీ భాస్కర్ నాయుడు, ఏపీడీ బాలాజీనాయక్ హాజరయ్యారు. మండలంలోని 19 గ్రామ పంచాయతీలకు చెందిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీపథకం పనులపై గ్రామాల వారిగా డీఆర్‌పీలు చదివి వినిపించారు. గ్రామాల్లో వివిధ పనులకు మొత్తం రూ.7,40,03,440 నిధులు ఖర్చు పెట్టామని, ఇందులో రూ.4,66,642 రికవరీకి అధికారులు ఆదేశించినట్లు ఎస్ఆర్‌పీ మురాద్ తెలిపారు. చెరుకుచెర్ల గ్రామ ప్రజలు ఫీల్డు అసిస్టెంటు అవకతవకలకు పాల్పడ్డాడని, విచారణ చేపటి చర్యలు తీసుకుంటారని తెలిపారు. అనంతరం రైతులు, నాయకులు రహదారులను ఏర్పాటు పీడీ జనార్దన్‌రావుకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో ఎంపీడివో దశరథ రామయ్య, ఏపీడి అనసర్ బేగం, క్వాలిటీ కంట్రోలర్ గంగాధర్, ఏపీవో జయంతి పాల్గొన్నారు.

ఆకు పచ్చదనంతో భూసారం పెరుగుదల

● జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ



రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ

పాణ్యం, నవంబరు19 (ఆంధ్రజ్యోతి) : ఏడాది పొడుగునా పొలాన్ని ఆకుపచ్చదనంతో కప్పి ఉంచితే భూసారం పెరుగుతుందని జిల్లా వ్యవసాయ అధికారి డాక్టర్ మురళీకృష్ణ అన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం భూపనపాడు గ్రామంలోని వరి పంటలను పరిశీలించారు. ఆయన మట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా పండిస్తున్న వరి పంటపై రైతులకు అవగాహన కల్పించారు. నెలలో కర్బన శాతం పెరగడమే గాక సూక్ష్మ పోషకాలు అధికంగా పెరుగుతాయన్నారు. పాల ఉత్పత్తి పెంచే మార్గదర్శకాల గురించి పశుసంవర్థక శాఖ అధికారి పుల్లయ్య వివరించారు. ఉద్యాన వనశాఖ సహాయకులకు రికార్డులు, సమాచార నిర్వహణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు అధికారి డాక్టర్ నరేంద్రకుమార్‌రెడ్డి, ఏఈఓ ప్రియాంక, జయంతి, ఉమామహేశ్వరుడు, పాల్గొన్నారు.

పంటల సాగులో మెలకువలు పాటించాలి

ఆత్మకూరు రూరల్: పంటల సాగులో రైతులు మెలకువలు పాటించాలని డీఆర్సీ ఏవో హేమలత, ఉద్యానవన అధికారి చందన, ఆత్మకూరు మండల వ్యవసాయాధికారి విష్ణువర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం శ్రీపతిరావు పేట, పిన్నాపురం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులకు పలు సూచనలు చేశారు.మినుము పంటలో విత్తన శుద్ధి, ఆ పంటకు ఆశించే పురుగులు, తెగుళ్ళ నివారణ పద్ధతుల గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త నిరసనలను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న ఏసురత్నం

ఆత్మకూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం రైతు, కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ నవంబరు 26న దేశవ్యాప్తంగా తలపెట్టిన నిరసనలను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం పేర్కొన్నారు. మంగళవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. కార్మికుల హక్కుల కాలరాస్తూ 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చడం సరికాదని అన్నారు. అలాగే కార్మికులందరికి రూ.26వేల వేతనం ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయం కల్పించాలన్న డిమాండ్లతో చేపట్టబోయే దేశవ్యాప్త నిరసనలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీఐటీయూ నాయకులు రామ్‌నాయక్, సురేంద్ర, ఇస్మాయిల్, నూర్‌అహ్మద్, బాషా, మంజుల, లక్ష్మీదేవి, ముబారక్, రమిజాబీ, విజయలక్ష్మీ, చెన్నమ్మ ఉన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

- ఖాళీ బిందెలతో నిరసన



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న ప్రజలు

ప్యాపిలి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి) : తాగునీటి సమస్య పరిష్కరించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని గుడిపాడు సచివాలయం ముందు ఎస్సీ కాలనీ వాసులు సీపీఐ ఆధ్వర్యంలో ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు రాధాకృష్ణ, వెంకటేశ్ మాట్లాడు తూ ఆరు నెలలుగా ఎస్సీ కాలనీలో తాగునీటి ఎద్దడి నెలకొన్న ఎవ రూ పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. తాగునీటి సమస్య వల్ల కాలనీవాసులు దాదాపు మూడు కి.మీ. దూరం ఉన్న వ్యవసాయ బోరుబావుల దగ్గరకు వెళ్లి నీరు తెచ్చుకుంటున్నారన్నారు. అధికారులు గుడిపాడు ఎస్సీకాలనీలో తాగునీటి సమస్య పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికి మెరుగైన వైద్యసేవలు



కలుగొట్లలో క్యాన్సర్ వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న ప్రోగ్రాం అధికారి కాంతారావు

కోవెలకుంట్ల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరికి మెరుగైన వైద్య సేవలు అందించ డమే ప్రభుత్వ లక్ష్యమని ఆర్‌బీఎస్‌కే, ఎన్‌సీడీసీడీ ప్రోగ్రాం అధికారి కాంతా రావు వైద్యసిబ్బందికి సూచించారు. మంగళవారం మండల పరిధిలోని కలుగొట్ల గ్రామంలో ఇంటింటికి తిరిగి క్యాన్సర్ పరీక్షలు నిర్వహించారు. జిల్లా అధికారి కాంతారావు ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్ల పైబడిన వారికి ఉచితంగా క్యాన్సర్ వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వైద్యసిబ్బంది ప్రతిరోజూ ఐదు ఇళ్ల చొప్పున ఎంచుకుని వైద్యపరీక్షలు చేయించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ విద్యాసాగర్, వాణి, ఎఎన్‌ఎం సుజాత, సీహెచ్‌వో మమత, ఆశా వర్కర్లు విజయ, నాగజ్యోతి పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల: ప్రభుత్వం ఆదేశాల మేరకు క్యాన్సర్ స్ర్కీనింగ్ కార్యక్రమాన్ని అత్యంత పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు కొలిమిగుండ్ల పీహెచ్‌సీ వైద్యుడు హరిచరణ్‌రెడ్డి తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాల్లో కొనసాగుతున్న క్యాన్సర్ సర్వే కార్యక్రమంపై ఆయన సమీక్షించి తనిఖీ చేపట్టారు. 18సంవత్సరాలు నిండిన ప్రతి మహిళను పరీక్షిస్తామన్నారు. వైద్య సిబ్బంది ఇంటింటికీ తిరిగి ఈ సర్వే చేపడుతున్నట్లు తెలిపారు.

'పట్టణంలో ప్లాస్టిక్‌ను నిర్మూలిద్దాం'



ఉన్నతా పాఠశాలలో ప్రసంగిస్తున్న బీసీ ఇందిరమ్మ

బనగానపల్లె , నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె పట్టణంలో వచ్చే సంక్రాంతి పండుగ నాటికీ ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిర్మూలిద్దామని, ఇందుకు విద్యార్థుల సహకారం అవసరమని టీడీపీ నియోజకవర్గ నాయకురాలు బీసీ ఇందిరమ్మ పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని ఉన్నత పాఠశాలలో ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే నష్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆరోగ్యకర సమాజాన్ని అందించేందుకు ప్రజలందరూ తాను చేపట్టిన ప్లాస్టిక్ నిషేధ యజ్ఞంలో భాగస్వాములు కావాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రామకృష్ణ, టీడీపీ నాయకులు టంగుటూరు శ్రీనయ్య రాయలసీమ సలాం, నాగరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దంత వైద్య పరీక్షలు

డోన్ రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో 6, 7 తరగతుల విద్యార్థులకు ఉచిత దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. మంగళవారం అనీఫ్ మరియు సోల్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత దంత వైద్యశిబిరంలో కర్నూలు మెడికవర్ హాస్పిటల్ సంబంధిత వైద్యురాలు నిహారిక రెడ్డి విద్యార్థులకు దంత వైద్య పరీక్షలు చేశారు. విద్యార్థులకు టూత్‌బ్రెష్‌లు, పేస్టులు ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో అగ్రిసెల్ హెల్త్ పి.నారాయణరెడ్డి, అమీస్ క్రాఫ్ సైన్స్ హెచ్‌ఆర్ హెడ్.హేమలత, షణ్ముకసాయి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్, తదితరులు పాల్గొన్నారు.

సారా విక్రేతల అరెస్టు

డోన్ రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): డోన్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని ప్యాపిలి మండలం గొల్లపల్లి బుగ్గ వద్ద నాటుసారా త రలిస్తున్న ఇద్దరు వ్యక్తులను ఎక్సైజ్ పోలీసులు దాడులు చేసి అరెస్టు చేశారు. ఆలేబాదు తండాకు చెందిన ఆర్.శంకర్ నాయక్, ఎం.శంకర్ నాయక్ మోటారుబైక్‌పై 80 లీటర్ల నాటుసారా తరలిస్తుండగా.. స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ వరలక్ష్మి తెలిపారు. బైక్ సీజ్ చేశామన్నారు.

పాలిటెక్నిక్ కళాశాల సందర్శన

బనగానపల్లె , నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె రవ్వల కొండపై ఉన్న మోడల్‌స్కూల్ విద్యార్థులు క్షేత్ర ప్రదర్శనలో భాగంగా మంగళవారం బనగానపల్లె వాసవీ పాలిటెక్నిక్ కళాశాలను సందర్శించారు. ప్రిన్సిపాల్ రామలక్ష్మి ఆధ్వర్యంలో కళాశాలను సందర్శించి అక్కడ ఉన్న వివిధ రకాల ల్యాబ్‌లను పరిశీలించారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

సంతాన వేణుగోపాలస్వామికి ప్రత్యేక పూజలు

రుద్రవరం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్ర మైన రుద్రవరంలో కొలువుదీరిన సంతాన వేణుగోపాలస్వామికి మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు నిత్యతృప్తదాస్ అభిషేకం చేసి పూజలు ప్రారంభించారు. తరలివచ్చిన భక్తులు గీతాపారాయణం చేసి సంతాన వేణుగోపాలస్వామి రుక్మిణీ సత్యభామ అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

అభివృద్ధికి ఐకమత్యంతో కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి

బేతంచెర్ల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ అభివృద్ధికి నాయకులు, కార్యకర్తలు ఐకమత్యంతో కృషి చేయాలని ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో టీడీపీ మండల కన్వీనర్ ఎల్ల నాగయ్య అధ్యక్షతన టీడీపీ సభ్యత్వ నమోదు పై ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో టీడీపీ సభ్యత్వ నమోదు ముమ్మరంగా సాగుతుందని, మండలంలో కూడా టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా సభ్యత్వ నమోదు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా సభ్యత్వ నమోదు యొక్క ప్రయోజనాలను వివరించారు. నియోజకవర్గాన్ని సస్యశ్యామలంగా కృషి చేసేందుకు గోరుకల్లు రిజర్వాయరు నుంచి సాగునీరు అందించేందుకు రూ.10వేలు కోట్లు ఖర్చు అవుతుందని తెలిపారు. జనవరి ఆఖరునాటికి గోరుకల్లు రిజర్వాయర్లు నీటిని సరఫరా చేస్తామన్నారు. రైతులకు సాగునీరు అందించేందుకు తాను కృషి చేస్తున్నట్లు తెలిపారు. అలాగే ఎల్లనాగయ్య మాట్లాడుతూ గ్రామాల్లో టీడీపీ నాయకులు సభ్యత్వ నమోదుకు పూర్తి చేయాలన్నారు. బుగ్గన ప్రసన్న లక్ష్మి మాట్లాడుతూ బేతంచెర్ల మండలంలో టీడీపీ సభ్యత్వం 25వేలకు పైగా చేసేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం పట్టంలోని ప్రభుత్వ సామాజిక కమ్యూనిటీ ఆసుపత్రి పరిశీలించారు. రోగుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన 15 నూతన బెడ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. తాగునీటి వసతి కల్పించేందుకు త్వరలో ఆర్వో ప్లాంటు ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

ఆసుపత్రి అభివృద్ధి కమిటీ నియామకం ఏకగ్రీవం

బేతంచెర్ల ప్రభుత్వ సామాజిక ఆసుపత్రి అభివృద్ధి కోసం సూపరింటెండెంట్ డాక్టర్ సాగరిక అధ్యక్షతన ప్రభుత్వం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ నియామకాన్ని ఏకగ్రీవంగా ఎమ్మెల్యే కోట్ల సమక్షంలో మంగళవారం ఎన్నుకున్నారు. కమిటీ చైర్మన్‌గా ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి, సభ్యులుగా నంద్యాల ఎంపీ డాక్టర్ శబరి, సూపరింటెండెంట్ డా.సాగరిక, ఎంపీడీవో ఫజిల్ రెహిమాన్, నగర పంచాయతీ కమిషనర్ హరిప్రసాద్‌లతో పాటు సభ్యులను ఎన్నుకున్నారు. సమావేశంలో మాజీ ఎంపీపీ సోమశేఖర్ రెడ్డి, టీడీపీ నాయకులు ఉన్నం చంద్రశేఖర్, తిరుమలేష్ చౌదరి, మాజీ ఎంపీటీసీ సభ్యులు బుగ్గన ప్రభాకర్ రెడ్డి, సుధాకర్ చౌదరి, కేవీ సుబ్బారెడ్డి, బజాజ్ రామిరెడ్డి, బుగ్గన బ్రహ్మానందరెడ్డి, అడ్వకేట్ భాస్కర్ రెడ్డి, వర్దన్ రెడ్డి, మేకల నాగరాజు, రూబెన్ తదితరులు పాల్గొన్నారు.

దాడులు అరికట్టాలి

అసెంబ్లీలో ఆళ్లగడ్డ ఎమ్మెల్యే అఖిలప్రియ



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఆళ్లగడ్డ ఎమ్మెల్యే

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), నవంబరు 19(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని మహిళలు, చిన్నారులపై జరుగుతున్న అఘాయిత్యాలు, దాడులను పూర్తిగా అరికట్టాలని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అసెంబ్లీలో గళం వినిపించారు. ప్రస్తుతం హోం శాఖకు బడ్జెట్‌లో రూ.8,495 కోట్లు కేటాయించారని.. రక్షణ శాఖకు కేటాయించే స్థాయిలో మరిన్ని నిధులివ్వాలని ఆమె కోరారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో మహిళలపై ఎన్నో అత్యాచారాలు, దాడులు జరిగాయన్నారు. నిందితులను శిక్షించి బాధితులకు సత్వర న్యాయం జరగాలంటే అత్యాధునిక టెక్నాలజీతో రాష్ట్రంలో ఫోరెన్సిక్ ల్యాబ్‌ను నిర్మించాలని అఖిలప్రియ ప్రతిపాదన చేశారు. రాష్ట్రంలో మహిళలు, చిన్నారులపై జరుగుతున్న దాడులను నివారించేందుకు డాక్యుమెంటరీలు, షార్ట్ ఫిల్మ్, వీడియోలతో పాటు ప్రకటనల రూపంలో హోం శాఖ యువతకు అవగాహన పెంపొందించాలన్నారు.

పేకాట, మట్కాపై ఉక్కుపాదం



మాట్లాడుతున్న డీఎస్పీ రవికుమార్

రుద్రవరం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఆళ్లగడ్డ సబ్ డివిజన్‌లో మట్కా, పేకాట, బ్రోతల్ నిర్వాహకులపై ఉక్కుపాదం మోపుతామని ఆళ్లగడ్డ డీఎస్పీ రవికుమార్ హెచ్చరించారు. మంగళవారం రుద్రవరం పోలీసుస్టేషన్‌ను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రికార్డులు సక్రమంగా ఉన్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు. బెల్టుషాపుల నిర్వాహకులపై దాడి చేసి కేసులు నమోదు చేస్తున్నామన్నారు. పల్లెల్లో ప్రజలు ప్రశాంతంగా ఉండాలని కోరారు. పల్లెల్లో ప్రజలు ఎలాంటి ఘర్షణలకు పాల్పడకుండా ప్రశాంత జీవితం గడపాలా న్న రు. కార్యక్రమంలో ఎస్‌ఐ వర ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ఝాన్సీ లక్ష్మీబాయిని ఆదర్శంగా తీసుకోవాలి



ఆళ్లగడ్డలో నివాళి అర్పిస్తున్న ఎస్‌ఐ నగీనా, అమీర్ బాషా

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), నవంబరు 19(ఆంధ్రజ్యోతి) : బ్రిటీష్ వారిని ఎదురించి పోరాడిన వీర మహిళ ఝాన్సీ లక్ష్మీబాయిని ఆదర్శంగా తీసుకోవాలని పట్టణ ఎస్‌ఐ నగీనా, ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ నియోజకవర్గ అధ్యక్షుడు అమీర్ బాషా అన్నారు. ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి సందర్భంగా పడకండ్లలోని బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి మంగళవారం నివాళి అర్పించారు. ఆపదలు వచ్చినప్పుడు కృంగి పోకుండా ఆత్మవిశ్వాసంతో ఎలా వ్యవహరించాలో వారు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ విజయకుమారి, ఉపాధ్యాయునులు, బాలికలు పాల్గొన్నారు.

ప్యాపిలి: మండల కేంద్రంలోని సరస్వతి శిశుమందిరంలో మంగళవారం ఝాన్సీలక్ష్మీబాయి జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఝాన్సీబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పంట కోత ప్రయోగం పరిశీలన

రుద్రవరం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద్దకంబలూరు గ్రామంలో శుంట కోత ప్రయోగాన్ని మంగళవారం జిల్లా చీఫ్ ప్లానింగ్ ఆఫీసరు వేణుగోపాల్ పరిశీలించారు. 5 ఇంటు 5 మీటర్ల వ్యాసార్థంలో పంట కోత ప్రయోగం నిర్వహించారు. ఈ లెక్కన 17.76 కేజీల ధాన్యం దిగుబడి వచ్చింది. మండలంలో అన్ని గ్రామాల్లో పంట కోత ప్రయోగం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

విత్తన కొనుగోలులో జాగ్రత్తలు పాటించాలి

రుద్రవరం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : రైతులు విత్తనాల కొనుగోలులో జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయాధికారి నాగేంద్రప్రసాద్ అన్నారు. మంగళవారం మండలంలోని కోటకొండ, శ్రీరంగాపురం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు తప్పనిసరిగా బిల్లు పొందాలని అన్నారు. కార్యక్రమంలో ఏఈవో రాజు, వీపీఏలు రేవతి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



శిరివెళ్లలో నూతనంగా ఎన్నికైన మత్స్యకార సంఘం ప్రతినిధులు

శిరివెళ్ల, నవంబరు 19(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని మత్స్యకారుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఆత్మకూరు మత్స్య అభివృద్ధి అధికారి (ఎఫ్‌డీవో), ఎన్నికల నిర్వహణ అధికారి కేబీ భరత్ లాల్ నాయక్ అన్నారు. గ్రామంలోని సచివాలయం-1లో శిరివెళ్ల మత్స్యకార సంఘానికి మంగళవారం ఎన్నికలు నిర్వహించారు. ఇందులో మత్సకార సంఘం అధ్యక్షుడిగా మాజీ ఎంపీటీసీ కొండబోయిన బాలచంద్రుడు, ఉపాధ్యక్షుడిగా పార్వతీశం, కార్యదర్శిగా వెంకటేశ్వర్లుతో పాటు ఆరుగురు కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి, వారి అభివృద్ధికి కృషి చేస్తామని నూతన పాలకవర్గ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఆళ్లగడ్డ అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫిషరీష్ విజయరాజ్, ఫిషరీష్ అసిస్టెంట్ నరసింహ, మాజీ జడ్పీటీసీ యామా గుర్రప్ప, టీ డీపీ నాయకులు నూరా రామ, ఉల్లి వెంకట సుబ్బయ్య, చిలకల పెదరాయుడు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

ఉయ్యాలవాడ, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల బీఎల్‌వోలు ఎన్నికల విధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని తహసీల్దారు శ్రీనివాసులు హెచ్చరించారు. మంగళవారం ఆయా గ్రామాల బీఎల్‌వోలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 30 మంది బీఎల్‌వోలు ఉండగా 25 మంది హాజరయ్యారన్నారు. ఈ నెల 23, 24వ తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం ఉందన్నారు. ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5.30 గంటల వరకు కేంద్రాలలో ప్రజలకు అందుబాటులో ఉండి అర్జీలు స్వీకరించాలన్నారు. ఓటరు నమోదు గురించి గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో డీటీ ప్రసాద్‌బాబు, ఆర్‌ఐ అంకన్న, వీఆర్వోలు ఉన్నారు.

సమ్మర్ స్టోరేజీ ట్యాంకు పరిశీలన

రుద్రవరం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శ్రీరంగాపురం సమ్మర్ స్టోరేజీ ట్యాంకును ఆర్‌డబ్ల్యూఎస్ ఇన్‌చార్జి డీఈ మురళి మంగళవారం పరిశీలించారు. సమ్మర్ స్టోరేజీ ట్యాంకుకు నీరు టీజీపీ కెనాల్ నుంచి సప్లై అయ్యే పైపులైనును పరిశీలించారు. సమ్మర్ స్టోరేజీ ట్యాంకును ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని ఆయన అన్నారు. ఆయన వెంట ఏఈ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

దొర్నిపాడు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని గ్రంథాలయ అధికారి అఖిలాబేగం అన్నారు. మంగళవారం దొర్నిపాడు గ్రంథాలయ ఆవరణలో విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు. అనంతరం ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు ఉన్నారు.

డెంగీపై అప్రమత్తంగా ఉండాలి



వైద్యశాలను తనిఖీ చేస్తున్న నోడల్ అధికారి జయచంద్రారెడ్డి

చాగలమర్రి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో డెంగీపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యశాఖ నోడల్ అధికారి జయచంద్రారెడ్డి తెలిపారు. మంగళవారం చాగలమర్రి ప్రభుత్వ వైద్యశాలను తనిఖీ చేశారు. రికార్డులను, పరిసరాలను పరిశీలించారు. వైద్య సిబ్బందిచే వైద్య సేవ గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎఫ్‌డీపీ అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులను ఉచితంగా అందజేస్తామని అన్నారు. వైద్యులు సెలవులో ఉంటే వేరే వైద్యులతో ఎఫ్‌డీపీ కార్యక్రమం నిర్వహిస్తామని అన్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఎన్‌సీడీసీడీ కార్యక్రమం(అందరికి క్యాన్సర్ పరీక్షలు)లో భాగంగా ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి సర్వే నిర్వహించి నోటి, బ్లెడ్ క్యాన్సర్ వ్యాధులపై అవగాహన కల్పిస్తారని అన్నారు. అనంతరం స్థానిక ప్రభుత్వ వైద్యశాలను తనిఖీ చేసి వివిధ రికార్డులను పరిశీలించి తగిన సూచనలు, సలహాలు అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు ఇమ్రాన్, శివమోహన్, సీహెచ్‌వో రమణమ్మ, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటమ్మ, హెల్త్ సూపర్‌వైజర్ రామలింగారెడ్డి పాల్గొన్నారు.

గ్రామీణ రోడ్లకు మహర్దశ



సంజామలలో జరుగుతున్న సీసీ రోడ్డు పనులు

సంజామల, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని అంతర్గత రహదారులకు మహర్దశ వచ్చింది. గత ఐదేళ్లుగా వైసీపీ పాలనలో అభివృద్ధికి నోచుకోని అస్తవ్యస్తంగా ఉన్న అంతర్గత రహదారులకు మోక్షం లభించింది. రోడ్లు భవనాల శాఖా మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి మండలంలోని 29 అంతర్గత రహదారుల ఏర్పాటుకు రూ. 4.35 కోట్లు విడుదల చేశారు. ఈ నిధులతో ఆయా గ్రామాల్లో పనులు ప్రారంభమయ్యాయి. మండల కేంద్రమైన సంజామలలో కెనరా బ్యాంకు ఎదురుగా రూ. 10లక్షలతో మంగళవారం రోడ్డు పనులు ప్రారంభించారు. టీడీపీ మండల ఉపాధ్యక్షుడు మల్కి హుసేన్ ఆధ్వర్యంలో పనులు జరుగుతున్నాయి. పనుల్లో అవకతవకలు జరగకుండా నాణ్యతా ప్రమాణాలు పాటించాలంటూ డీఈ నాగశ్రీనివాసులు కాంట్రాక్టులకు సూచించారు. పనులను పంచాయితీరాజ్ ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు రషీదు, రవితేజారెడ్డి పర్యవేక్షిస్తున్నారు.

ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్యను పెంచాలి

అవుకు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : అవుకు పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో ప్రసవాల సంఖ్యను పెంచే విధంగా డాక్టర్లు కృషి చేయాలని హాస్పిటల్స్ సర్వీసెస్ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ జఫ్రుల్లా అన్నారు. మంగళవారం అవుకులోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ జఫ్రుల్లా మాట్లాడుతూ ఆసుపత్రిలోని ఆపరేషన్ థియేటర్‌ను, వార్డులను పరిశీలించామన్నారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సదుపాయాలను రోగులను అడిగి తెలుసుకున్నారు. ప్రసవాల సంఖ్య పెంచేందుకు మరొక ఆపరేషన్ థియేటర్‌ను ఏర్పాటు చేసే విధంగా చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అభినయ్, డాక్టర్లు సుష్మ, కళ్యాణ్‌శ్రీనివాస్, సుధాప్రియాంక, సిబ్బంది పాల్గొన్నారు.

కంది పంటలో జాగ్రత్తలు తీసుకోవాలి: ఏడీఏ

డోన్ రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కంది పంట కాయ దశలో ఉన్నందున రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని డోన్ వ్యవసాయ ఏడీఏ అశోక్‌వర్ధన్ రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని మార్కెట్ యార్డు సమావేశ భవనంలో రైతు సేవా కేంద్ర సిబ్బందికి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ అశోక్‌వర్ధన్ రెడ్డి మాట్లాడుతూ శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు తీసుకుని రైతులకు సేవలు అందించాలని రైతు సేవా కేంద్ర సిబ్బందికి సూచించారు. త్వరలోనే రబీ పంట నమోదు ప్రారంభమవుతుందని తెలిపారు. సమావేశంలో జిల్లా వనరుల కేంద్ర వ్యవసాయ సహాయ సంచాలకురాలు సరళమ్మ, శాస్త్రవేత్త ఆదినారాయణ, డోన్ వ్యవసాయాధికారి అబ్దుల్‌షఫీ, బేతంచెర్ల, ప్యాపిలి మండలాల ఏవోలు పాల్గొన్నారు.

శనగసాగులో మెలకువలు పాటించాలి

కోవెలకుంట్ల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : శనగసాగులో రైతులు మెలకువలు పాటించాలని వ్యవసాయాధికారి నిరంజన్ అన్నారు. మంగళవారం కోవెలకుంట్ల మండల పరిధిలోని పొట్టిపాడు, గుళ్లదుర్తి గ్రామాల్లో పొలం బడి నిర్వహించారు. ఈ సందర్భంగా వరిపైరు, శనగపంటను వ్యవసాయాధికారి పరిశీలించారు. రైతులు సాగు చేసిన శనగపంటలో తెగుళ్లు, పురుగులు సోకడం తో పంట పసుపు రంగుగా మారి చనిపోతుందని, వీటిని గమనిం చి తగిన మందులు వాడి నివారించుకోవాలన్నారు. పంట బీమా కు సంబంధించిన ప్రీమియం చెల్లించి పంట నమోదు చేయించు కోవాలన్నారు. కార్యక్రమంలో రైతులు, టీడీఈ నాయకుడు సుం దరరెడ్డి పాల్గొన్నారు.

బనగానపల్లె ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌గా శ్రీనివాసులు

బనగానపల్లె , నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె సబ్ రిజిస్ట్రార్ శ్రీధర్‌గుప్తా సస్పెన్షన్‌కు గురికావడంతో ఆయన స్థానంలో ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌గా శ్రీనివాసులు నియమితులయ్యారు. మంగళవారం ఆయన ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్‌గా బాధ్యతలు స్వీకరించారు. నంద్యాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తూ ఇక్కడికి వచ్చారు.

నీట మునిగిన మిరప పంట



వల్లంపాడు గ్రామంలో నీట మునిగిన మిరపపంట

కోవెలకుంట్ల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఎస్ఆర్‌బీసీ 7వ బ్లాక్ కాల్వ పొంగి ప్రవహించడంతో మండలంలోని వల్లంపాడు గ్రామానికి చెందిన కౌలు రైతు హుసేన్ మిరప పంట నీట మునిగింది. దాంతో సుమారు రెండు ఎకరాలు పంట దెబ్బతిన్నది. మిరప సాగు చేయడానికి లక్షలాది రూపాయలు ఖర్చు చేశామని, చేతికందే సమయంలో నీట మునిగి దెబ్బతినడంతో తీవ్ర నష్టం వాటిల్లిందని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం న ష్టపరిహారం అందించాలని కోరారు.

బాధ్యతలు స్వీకరించిన హౌసింగ్ ఏఈ

కోవెలకుంట్ల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : కోవెలకుంట్ల హౌసింగ్ ఏఈగా సోమవారం కేవీ రమణారెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఆళ్లగడ్డ నుంచి బదిలీపై కోవెలకుంట్ల మండలానికి వచ్చా రు. ఇక్కడ ఇన్‌చార్జి ఏఈగా విధులు నిర్వహిస్తున్న మద్దిలేటి నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో వర్క్ ఇన్స్‌పెక్టర్లు పాల్గొన్నారు.

పేదల మన్నన పొందాలి : బీసీ రాజారెడ్డి



వైద్య శిబిరం ప్రారంభిస్తున్న మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి

బనగానపల్లె , నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మెరుగైన వైద్య సేవలందించి పేదల మన్ననలు పొందాలని బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలో దియావైద్యశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా మెడికల్ క్యాంపును మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సుదూర ప్రాంతాలకు వెళ్లకుండా కార్పొరేట్ వైద్యసేవలు బనగానపల్లెలోనే అందు తున్నాయన్నారు. ఇలాంటి ఉచిత మెడికల్ క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. డాక్టర్ రాఘవేంద్ర, డాక్టర్ ప్రశాంతి రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏసురత్నం, ప్రముఖ పారిశ్రామికవేత్తలు దొనపాటి యాగంటిరెడ్డి, సీహెచ్‌నాగిరెడ్డి, గాలిమద్దిలేటిరెడ్డి, బాల తిమ్మా రెడ్డి, టింబర్ డిపో పుల్లారెడ్డి, ఎన్‌సీ సుబ్బారెడ్డి, వెంకటరెడ్డి, కో టా శివశంకర్, బీరువాలపుల్లారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

పోక్సో చట్టంపై అవగాహన

సంజామల, నవంబరు 19(ఆంధ్రజ్యోతి) : పోక్సో చట్టంపై అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శాంత, సుగణ అన్నారు. మంగళవారం సంజామల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో పోక్సో చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 18 సంవత్సరాల లోపు బాలికలపై లైంగిక వేధింపులు, అత్యాచారాలు జరిగినట్లయితే 10 సంవత్సరాలు జైలు శిక్ష లేదా జీవిత ఖైదు శిక్ష పడుతుందన్నారు. బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాల గురించి వివరించారు. సమావేశంలో కేజీబీవీ ప్రిన్సిపాల్ శ్రీలేఖ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతిపాదనలు విరమించుకోవాలి: ఎస్టీయూ

అవుకు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలల పనివేళల పెంపు ప్రతిపాదనను విద్యాశాఖ ఉన్నతాధికారులు విరమించుకోవాలని ఎస్టీయూ జిల్లా జనరల్ సెక్రటరీ అజాంబేగ్ కోరారు. మంగళవారం మండలంలోని గుండ్లశింగవరం జడ్పీ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయులతో స్కూల్ కాంప్లెక్స్ సమా వేశాన్ని నిర్వహించారు. అనంతరం ఉపాధ్యాయులు ఎంఈవో శ్రీధర్‌రావుకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో జడ్పీ ఉన్నత పాఠశాలల గణిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'స్పందన' అర్జీలను పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీపీవో షేక్ జమీఉల్లా

బనగానపల్లె, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని డీపీవో షేక్ జమీఉల్లా సూచించారు. మంగళవారం బనగానపల్లె ఎంపీడీవో కార్యాలయంలో బనగానపల్లె, డోన్ నియోజకవర్గాల సచివాలయాల కార్యదర్శులు, ఈవోఆర్‌డీలు, ఈవోలతో డీపీవో ప్రత్యేక రివ్యూ నిర్వహించారు. ప్రధానంగా గ్రామాల్లో జరుగుతున్న సీసీ రోడ్ల నిర్మాణం పనులు, స్పందన కార్యక్రమంపై వస్తున్న దరఖాస్తులపై చర్చించారు. సమావేశంలో డోన్ డివిజన్ డీఎల్‌పీవో బాలకృష్ణుడు, ఎంపీడీవో వెంకటరమణ, అధికారులు పాల్గొన్నారు.

దివ్యాంగుడికి చేయూత

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), నవంబరు 19(ఆంధ్రజ్యోతి) : మండలంలోని అహోబిలం గ్రామంలో ఇటీవల దివ్యాంగుడు కృష్ణ గుడిసె దగ్ధమైంది. మంగళవారం ఆదరణ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు జజ్జూరి మరియదాసు చేయూత అందించారు. బాధితుడు కృష్ణకు మూడు క్వింటాళ్ల బియ్యంతో పాటు నిత్యావసర సరుకులు, పిల్లలకు దుస్తులు అందజేశాడు. దివ్యాంగుడి కుటుంబానికి ప్రభుత్వం ఇళ్లు నిర్మించి ఇవ్వడంతో పాటు జీవనోపాధి కల్పించాలన్నారు. కార్యక్రమంలో రుద్రవరం మండల అధ్యక్షుడు అబ్దుల్, కార్యదర్శి సత్తార్, ఎల్లప్ప పాల్గొన్నారు.

విద్యార్థులకు అనుకూలంగా ఉండాలి

రుద్రవరం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : క్రీడామైదానం విద్యార్థులకు సౌకర్యంగా ఉండాలని డిప్యూటీ ఈఈ నాగభూషణ్ రెడ్డి అన్నారు. మంగళవారం రుద్రవరం ఆదర్శ పాఠశాల క్రీడా మైదానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రీడలు ఆడేటప్పుడు మైదానం సౌకర్యంగా ఉండాలన్నారు. ఈ ఏడాది 20 మంది ఎస్‌జీఎఫ్ విభాగంలో రాష్ట్రానికి ఎంపికైనట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగేశ్వర్‌రావు, ఏ ఈ శంకర్ పాల్గొన్నారు.